J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 50 17.05.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# బాక్సుల్లో... భవిష్యత్!

## ముగిసిన యుద్ధం.. ఫలితాలు సిద్ధం!.. జూన్ 4 వరకూ సందిగ్ధం!!

*దేశ భవిష్యత్ బాగుండాలంటే రాష్ట్రాలు బాగుండాలి. రాష్ట్రాలు బాగుండాలంటే ఊర్లు బాగుండాలి. ఊర్లు బాగుండాలంటే జనం బాగుండాలి. జనం బాగుండాలంటే పాలన బాగుండాలి. పాలన బాగుండాలంటే నాయకుడు బాగుండాలి. ఆ నాయకుడిని ఎన్నుకునే బాధ్యత మనకి అయిదేళ్లకి ఒకసారి లభిస్తుంది. మనకి వరంలా లభించిన ఓటు మన స్వరమై వినిపిస్తుంది. ఆ అవకాశమే మొన్న 13వ తేదీ దేశ ప్రజలతో ఆంధ్రవాసులకి కూడా వచ్చింది. దేశ, రాష్ట్ర భవిష్యత్ కోసం సమర్ధవంతమైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని ఆంధ్ర రాష్ట్రంలో 81.86 శాతంమంది (పోస్టల్ బ్యాలెట్లతో కలిపి) అంటే సుమారుగా 3.4 కోట్లమంది తమ ఓటు వేయడం ద్వారా సద్వినియోగం చేసుకున్నారు. తమ దేశ భవిష్యత్తుతో పాటు, రాష్ట్ర భవిష్యత్తు, ఊరు భవిష్యత్తు, తమ నాయకుడి భవిష్యత్తుతో తద్వారా తమ భవిష్యత్తు ఎలావుండాలో ఆలోచించి నిర్ణయించి తీర్పు చెప్పారు. ఆ తీర్పు ఇప్పుడు బాక్సుల్లో భద్రంగా ఉంది. జూన్ 4వ తేదీ ఉదయం 10గంటలకల్లా ఫలితాల్లో స్పష్టత రావడం మొదలవుతుంది. మధ్యాహ్నానికి గాలి ఎటువైపు వీస్తుందో తెలిసిపోతుంది. సాయంత్రానికల్లా విషయం తేలిపోతుంది.*

### అటు దేశానికి, ఇటు రాష్ట్రానికి...
### ఇవి ప్రతిష్టాత్మక ఎన్నికలు!

గత పది సంవత్సరాలనుండి భారతీయ జనతా పార్టీ ఢిల్లీ పీఠంపై కూర్చుని చక్రం తిప్పుతోంది. నరేంద్ర మోడీ నాయకత్వంలో కమల దళం సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని అనేక ప్రతిష్టాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. హిందువుల చిరకాల కోరికగా మిగిలిపోయిన అయోధ్యలోని రామాలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆర్టికల్ 370 రద్దు చేశారు. ట్రిపుల్ తలాక్ విధానానికి అడ్డుకట్ట వేశారు. జీఎస్టీ ద్వారా వ్యాపార వాణిజ్య విభాగాల పన్ను చెల్లింపు విధానాలలో పెను మార్పుని తీసుకొచ్చారు. తమకి అపఖ్యాతి తెస్తుందని తెలిసినా వెనకడుగు వేయకుండా 1000, 500 రూపాయల నోట్లను రద్దు చేశారు. స్వచ్ఛభారత్ పేరుతో పరిశుభ్రత కోసం పరితపించారు. ప్రజా సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీనవర్గాల అభిమానాన్ని చూరగొన్నారు. దేశభద్రత కోసం సరిహద్దులో పహారా కాస్తున్న భారత సైనికులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించారు. కరోనాని కట్టడి చేయడంలో అనన్యసామాన్య ప్రతిభని కనపరచారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని, దేశాధినేతను వేనోళ్ళ కీర్తించేలా దేశ కీర్తిని విశ్వవ్యాప్తంగా రెపరెపలాడించారు. ఇవన్నీ మచ్చుకి కొన్ని మాత్రమే. ఇలాంటి అనేక విప్లవాత్మక కార్యక్రమాలని చేపట్టిన ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కింది. నరేంద్ర మోడీ అనే ఒకే ఒక్క నాయకుడిని తమ హీరోగా చూపించి భారతీయ జనతా పార్టీ దశాబ్దకాలంగా భారతదేశాన్ని పరిపాలించింది. ఇప్పుడు మళ్ళీ అదే నరేంద్రమోడీని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా చూపిస్తూ ముచ్చటగా మూడవసారి తమకి అధికారమివ్వమంటూ బీజేపీ ప్రజల ముందుకొచ్చింది.

భూతద్దం పెట్టి వెతికినా కూడా ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఛాయలు కనిపించవు. అలాంటి బీజేపీ ఈ ఎన్నికలలో టీడీపీ – జనసేనలతో పొత్తు పెట్టుకుని కూటమిగా ఏర్పడి పోటీలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాలంటే ఉత్తరాది పార్టీలకి చిన్నచూపు అన్న అపనింద, ఆంధ్రాకి ప్రత్యేకహోదా ఇస్తానని చెప్పిన మోడీ మాట తప్పారన్న అపవాదు ఎదుర్కొన్న కమలనాధులని ప్రజలు ఏపాటిగా ఆదరించారో వేచిచూడాలి.

### ఆంధ్రులకి చేదు అనుభవాలని మిగిల్చిన
### 2014 - 19 పరిపాలన!

రాజశేఖరరెడ్డి మరణించిన తరువాత 2014లో జరిగిన ఎన్నికలలో జగన్ ఓడిపోయారు. అకస్మాత్తుగా అశువులు బాసిన రాజశేఖరరెడ్డి వారసుడిగా, దేశంలో అధికారం చెలాయిస్తూ చక్రం తిప్పుతుండిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని ఎదిరించిన ధీరోదాత్తుడిగా, అకారణంగా పదహారు నెలలు జైలు శిక్ష అనుభవించిన అమాయకుడిగా ప్రజల ముందుకి వచ్చి ఓట్లు అర్థించినా, ఆంధ్రా జనం జగన్‌ని ఆదరించలేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కాబట్టి అనుభవశాలికే అధికారం అప్పజెప్పాలన్న ఆంధ్రుల అభిమతం ఆ ఎన్నికలలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. ఆ తరువాత జరిగిన అనేక కీలక పరిణామాలు 2019 నాటికి రాష్ట్ర రాజకీయాలను అనూహ్య మలుపు తిప్పాయి.

### బాబు తప్పటడుగులు!

లోకేష్‌ని అడ్డదారిలో మంత్రిని చేసి తన రాజకీయ వారసుడిగా చంద్రబాబు పరిచయం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వంతో తగువు పెట్టుకున్నారు. రాజధాని, పోలవరం నిర్మాణాల పేరుతో కేంద్రం 10లో

**• అదరగొట్టిన ఆంధ్రా ఓటరు**

**81.86 శాతం పోలింగ్‌తో రికార్డు సృష్టించారు**

**దేశంలో ఇప్పటివరకు జరిగిన ఓటింగ్‌లో..**
**మన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపారు** 3లో





# శ్రీసిటీలో..జపాన్ కాన్సుల్ జనరల్

నూతనంగా నియమితులైన చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకాహషి మునియో ఈనెల 15న బుధవారం నాడు శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్. శివశంకర్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం, ఆయన శ్రీసిటీలోని జపనీస్ పరిశ్రమల అసోసియేషన్ సభ్యులతో సమావేశమై చర్చించారు. ఇసుజు, ఐసన్, టీహెచ్‌కె పరిశ్రమలను సందర్శించి, అక్కడ పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు.

# వియస్‌యు కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ఆచార్య సి. హెచ్ విజయ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేషన్ సభ్యులు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ బి.వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'స్వీప్' కార్యక్రమాలతో.. జిల్లాలో పెరిగిన చైతన్యం

## • గతంలో కంటే ఎక్కువగా పోలింగ్ శాతం



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో జిల్లాలో ముమ్మరంగా చేపట్టిన ఓటరు అవగాహన (స్వీప్) కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి. 2019 ఎన్నికల పోలింగ్ కంటే, 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడం విశేషం. సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా మొదలుపెట్టారు. మే 13 పోలింగ్ రోజు వరకు కూడా ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించి స్వీప్ కార్యక్రమాలను ప్రతి గ్రామంలోనూ చేపట్టారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు స్వీప్ కార్యక్రమాలపై ప్రత్యేకదృష్టి సారించి ఓటర్లలో చైతన్యం కల్పించడంలో ప్రధానపాత్ర పోషించారు. ప్రధానంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడం, ఎల్‌ఈడి స్క్రీన్లతో కూడిన వాహనాల్లో ఓటు వినియోగం, ఆవశ్యకత, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించడం జరిగాయి. అదేవిధంగా, నగరంలోని ప్రధాన కూడళ్ళు, ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు అంటించి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటుహక్కు ప్రాధాన్యత అందరికీ తెలిసేలా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలు, మానవహారాల వల్ల ప్రజల్లో మంచి చైతన్యం వచ్చింది. పోలింగ్ తేది అయిన మే 13 పోలింగ్‌డే ప్రతిఒక్కరికి బాగా గుర్తుండేలా ముమ్మర ప్రచారం నిర్వహించారు. యువతకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కలిగేలా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జిల్లా స్థాయి అధికారులు, ప్రముఖులతో ప్రారంభించిన ఓటరు సెల్ఫీబూత్‌లు బాగా ఆకట్టుకున్నాయి. అలాగే ఓటు ఎక్కడుందో తెలుసుకునేందుకు ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన ఓటరు సహాయ కేంద్రాలు కూడా బాగా ఉపయోగపడ్డాయి. చాలా మంది ఈ కేంద్రాలకు వచ్చి తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకుని ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గానికి ఒక పింక్ పోలింగ్ కేంద్రం, యువత కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగ ఉద్యోగులతో నడిచే పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్ది ఓటర్లను ఆకర్షించారు. మహిళలు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటుచేసి మహిళలకు ఘనస్వాగతం పలికి మహిళలందరూ ఓటుహక్కు వినియోగించునేలా ఆహ్లాదకర వాతావరణం కల్పించారు.

### ఓటు పట్ల పెరిగిన అవగాహన

2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంటుకు 76.91శాతం పోలింగ్ నమోదు కాగా, అధికారులు చేపట్టిన ఓటు చైతన్య కార్యక్రమాల వల్ల ఈ ఎన్నికల్లో 79.63 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల కంటే 2.72 శాతం ఎక్కువగా ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మే13న పోలింగ్‌రోజున ఉదయం నుంచే ఓటర్లు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరగా, అర్ధరాత్రి వరకు జిల్లాలో పోలింగ్ నమోదైంది. 2019 కంటె కూడా పురుషులు, మహిళల ఓటింగ్ శాతం కూడా ఈ ఎన్నికల్లో బాగా పెరిగింది. 2019లో పురుషుల ఓటింగ్ 77.69శాతం కాగా, 2024లో 2.98 శాతం పెరిగి 80.67 శాతంగా నమోదైంది. 2019లో మహిళల ఓటింగ్ 76.83 శాతం కాగా, 2024లో 2.44 శాతం పెరిగి 79.37శాతంగా నమోదైంది.

# పోస్టల్ బ్యాలెట్‌లో.. భారీగా పోలింగ్

ఈసారి ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లోనూ జిల్లాస్థాయిలో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. అయిదురోజుల పాటు జరిగిన ఈ ఓటింగ్‌లో అధికసంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ కోసం జిల్లాలో 8 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటుచేశారు. ఇతర జిల్లాల ఓటర్ల కోసం నెల్లూరులో మరో సెంటర్ నెలకొల్పారు. ఈనెల 5 నుంచి 9వతేదీ దాకా జరిగిన ఈ పోలింగ్‌లో దూరాభారం అనుకోకుండా, ఎండ తీవ్రతను కూడా లెక్కచేయకుండా ఎంతెంతో దూరం నుంచి ఓటర్లు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవడం విశేషం. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో పోస్టల్ బ్యాలెట్లు మొత్తం 24,071 ఓట్లు నమోదు కాగా, అందులో నెల్లూరు నగరంలో 2,698, ఆత్మకూరులో 2,611, సర్వేపల్లిలో 1,397, ఉదయగిరిలో 2,493, కావలిలో 3,235, నెల్లూరు రూరల్‌లో 4,741, కోవూరులో 2,838, కందుకూరులో 1,908 ఓట్లు పోలయ్యాయి. ఇతర జిల్లాలవారికి సంబంధించి 2,150 ఓట్లు నమోదయ్యాయి.

# డా. శివశంకరయ్యకు.. మరో గౌరవం



నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలం చుంచులూరుకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, దారపు శిల్పి, ఉత్తమ ఉపాధ్యాయుడు శివశంకరయ్య ఉపాధ్యాయరంగంలో జిల్లా అత్యుత్తమ సాధకులుగా ఎంపికయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లాలో హెడ్మాస్టర్ స్థాయిలో ఒకరిని, ఉపాధ్యాయుల స్థాయిలో ఇద్దరిని, విద్యార్థుల స్థాయిలో మరో ఇద్దరిని అత్యుత్తమ సాధకులుగా ఎంపిక చేయగా, ఉపాధ్యాయ రంగంలో డా.శివశంకరయ్య ఈ గౌరవానికి ఎంపిక కావడం విశేషం. దీంతో ఆయన్ను ఉపాధ్యాయవర్గాలు అభినందించాయి. ఆయన ఇప్పటికే, 4 గౌరవ డాక్టరేట్‌లు, 4 అంతర్జాతీయ స్థాయి అవార్డులు, 56 జాతీయస్థాయి అవార్డులు పొంది ఉన్నారు.

## దంపూరు రామకృష్ణ రచించిన మరో ఆధ్యాత్మిక గ్రంథం

# కనుపర్తిపాడు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి చరిత్ర

దంపూరు రామకృష్ణ వృత్తిరీత్యా విశ్రాంత తహశీల్దార్. ప్రవృత్తిరీత్యా ఆధ్యాత్మికవేత్త. ఆయన మునుపు 'అవధూత జ్యోతి' (భగవాన్ వెంకయ్యస్వామి వెలుగు), అగ్నిస్వరూపుడు (వెంకయ్యస్వామి జీవితం, మహిమలు) అనే ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించి ఉన్నారు. ప్రస్తుత గ్రంథం 'శ్రీ నాగేంద్ర సహిత వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి సన్నిధి' అన్నది మూడవది. భక్తులు పుణ్యక్షేత్రాలను దర్శించినపుడు, ఆయా క్షేత్రాల పౌరాణిక, చారిత్రక విశేషాలను తెలుసుకోవాలనుకుంటారు. కానీ, భక్తులకు తృప్తి కలిగించే విధంగా అలాంటి సాహిత్యం అనేక దేవాలయాల్లో లభించడం లేదు. అలాంటి కొరతను కొంతకు కొంత దంపూరు రామకృష్ణ లాంటి రచయితలు తీరుస్తున్నారు.

నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు గ్రామం (నెల్లూరు రూరల్ మండలం), నెల్లూరుకు 3 కి.మీ దూరంలో ఉంది. రచయిత గొలగమూడి తరచూ వెళ్లి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామిని దర్శించుకుని వస్తూ మార్గమధ్యంలో కనుపర్తిపాడు వద్ద ఉన్న 'శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధి' గురించి విన్నారు. శ్రీ స్వామివారు స్వయంభువుగా వెలిశారని తెలుసుకున్నారు. అప్పటి నుండి ఆ దేవాలయ చరిత్ర పరిశోధనకుపక్రమించారు.

ఎన్నో ఏళ్ళ క్రితం ఏకాంబరం శేషయ్య అనే దర్జీకి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి బాలునిగా దర్శనం ఇవ్వడం, మెరుపుగా మెరిసి పుట్టలోకి వెళ్లడం, తన పూజాది కార్యక్రమాలను శేషయ్యనే చేయమని కోరడం, ఆ స్థలం ప్రసిద్ధ ఆలయంగా మారడం లాంటి వివరాలను వరుసక్రమంలో అందించారు. ఇంకా ఆలయ మహిమల మీద వివిధ పత్రికలు, ఆయా కాలాల్లో ప్రచురించిన వార్తలను, ఫోటోలను శ్రమించి సేకరించి పుస్తకంలో ఉటంకించారు. ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉన్న ఈ ఆలయ నిర్మాణం 1960-70ల మధ్య ప్రారంభం అయిందని, ప్రముఖ ఆధ్యాత్మిక సేవాపరాయణులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ ఆలయానికి ప్రహరీగోడ నిర్మించగా, ఆలయ ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్ రెడ్డి, పులి స్వరూపరెడ్డి కొన్ని నిర్మాణాలను చేసి, భక్తులకు సౌకర్యాలను కల్పించారని రచయిత తెలిపారు. అంతేగాక ఆగమశాస్త్ర ప్రకారం భక్తులు శ్రీ స్వామివారికి సమర్పించిన వాహన వివరాలు తెలిపారు. యాగశాల, కళ్యాణ మండపాల వివరాలు ఇచ్చారు. అన్ని అంశాలకు తగిన ఫోటోలను జత పరిచారు. అంతేగాక, 'సుబ్రహ్మణ్య షష్టి' అంటే ఏమిటో తెలిపారు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని త్రికరణశుద్ధిగా స్తుతించి, ఆరాధిస్తే సత్సంతాన ప్రాప్తి, శీఘ్ర వివాహం, సర్ప, దుష్ట, గ్రహ దోష పరిహారం, ఆయురారోగ్య సౌభాగ్య ప్రాప్తి, బుద్ధి జ్ఞాన వికాసాలు, మోక్షం కలుగుతాయని ఉదాహరణలతో సహా రచయిత వివరించారు. తరంగాలు పేరుతో 31 మంది భక్తుల (దంపతుల) అనుభవాలను సోదాహరణంగా ఫోటోలతో వివరించారు. తమిళనాడులోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరు ఆవాసాలను వివరించారు. శ్రీ స్వామివారి అనుగ్రహం పొందటానికి భక్తులు పఠించే 'శ్రీ సుబ్రహ్మణ్య అష్టకం.. కరావలంబ స్తోత్రం గ్రంథం చివరన ఇచ్చారు. దీంతో నవగ్రహ స్తోత్రం కూడా అందించారు. నేటికీ ఆదివారం రోజుల్లో ఈ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని సేవించడం ఆలయం యొక్క వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నది. ఇటీవల కాలంలో ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ విశేష భక్తజన ఆదరణ పొందుతున్నది. ఈ విషయాలన్నింటిని ఇందులో సమగ్రంగా వివరించారు.



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి సన్నిధి

**రచయిత:**
**దంపూరు రామకృష్ణ**
**పేజీలు: 166 వెల: అమూల్యం**
**ప్రతులకు:**
**డి.పద్మావతి**
**26-14-1142, వనంతోపు,**
**కొండాయపాలెంరోడ్డు, నెల్లూరు - 4.**

మొత్తంమీద రచయిత గొప్ప భక్తి తాదాత్మ్యంతో ఈ గ్రంథాన్ని రచించారని చెప్పవచ్చు. భక్తులందరికీ ఈ గ్రంథం కరదీపిక అవుతుందనడంలో సందేహం లేదు. అంతేగాక, భవిష్యత్తులో స్వామివారి మీద మరెన్నో గ్రంథాలు రావడానికి కూడా ఈ గ్రంథం మార్గదర్శకమవుతుందని కూడా అనుకోవచ్చు.

తన విశ్రాంత జీవితాన్ని ఆధ్యాత్మిక గ్రంథ రచనలో ధన్యం చేసుకుంటున్న భక్తితత్పరుడు ఆయన. ఇలాంటి గ్రంథాన్ని తన పరిశోధనా పటిమతో, రచనా సామర్థ్యంతో వ్యయప్రయాసల కోర్చి, రచించి, ముద్రించి భక్తులకు అందజేస్తున్న దంపూరు రామకృష్ణ జీవితం ధన్యం.



**డా. గంగిశెట్టి శివకుమార్**
**నెల్లూరు. సెల్:9441895343.**




# 81.86 శాతం పోలింగ్‌తో.. రికార్డు సృష్టించారు

## దేశంలో ఇప్పటివరకు జరిగిన ఓటింగ్‌లో.. మన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపారు

***ఆం**ధ్ర ఓటర్లు విజృంభించారు. తమ సత్తాఏమిటో చూపించారు. 'ఓటేసి జైకొట్టి తెలుగోడా'..అంటూ, గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ ఎన్నికల్లో అదరగొట్టేశారు. ఎక్కడెక్కడున్నారో కానీ..అంతా ఒక్కసారిగా ఒక ప్రవాహంలా పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఓట్ల నమోదులో తామే ఫస్ట్ అనిపించుకున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రం, నేటి విభజిత రాష్ట్రంలో సైతం ఇప్పటివరకు ఎప్పుడూ లేనివిధంగా ఆంధ్రరాష్ట్ర ఓటర్లు పాత రికార్డులన్నిటినీ బద్దలుకొట్టి అగ్రస్థాయిలో నిలిచారు. 2014లో కంటే 3.45 శాతం, 2019లో కంటే 2.09 శాతం ఎక్కువగా పోలింగ్ నమోదు కావడం, పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా కదిలివచ్చి ఓట్లేయడంతో దాదాపు 142స్థానాల్లో మహిళా ఓటర్ల నిర్ణయమే కీలకం కానుండడం ఎంతైనా విశేషం. అంతేకాదు, దేశంలో ఇప్పటివరకు జరిగిన ఈ నాలుగు దశల ఎన్నికల్లో ఆంధ్రా ఓటర్లదే అగ్రస్థానం. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా ఈనెల 15న వెల్లడించిన ఆసక్తికరమైన వివరాలివి.*

ఔను!.. ఆంధ్రావాళ్ళంటే బహు బద్ధకిస్టులని ఎద్దేవా చేసేవాళ్లకు గట్టి చెంపదెబ్బ తగిలిస్తూ.. ఆంధ్రులంటే ఏమిటో ఈ ఎన్నికల్లో రుచి చూపించారు. 'ఆరంభించరు ఆంధ్రులు'..అంటుంటారు కదా!...అయితే, ఆరంభమే గనక చేశామో..ఇక తిరుగుండదు మళ్ళా'!..అని నిరూపించుకున్నారు. ఏ సమయంలో ఏం చేయాలో, భూదేవంత సహనం ఉన్న ఆంధ్రులకు తెలుసు. కీలెరిగి వాతపెట్టడంలో ఆంధ్రులకంటే ఘనులు ఇంకెవరున్నారు?..అందుకే, భగ్గుమంటున్న ఎండలను సైతం ఖాతరు చేయలేదు. ఎంత దూరమైనా సరే.. వ్యయప్రయాసలనేమీ లెక్క చేయలేదు. ఆంధ్రావాళ్లు రాష్ట్రంలోనే కాదు, దేశవిదేశాల నుంచి కూడా వచ్చారు. 'ఓటేయాల్సిందేనంటూ' పట్టుబట్టి మరీ ఓటేశారు. ఇంత కసి ఎట్టావచ్చిందో మరి!..అనుకున్నారు బారులు తీరిన ఓటర్లను చూసి జనమంతా!..అయినా, అర్ధరాత్రి గడిచినా క్యూలైన్లను వదలిపెట్టకుండా ఓటేశారంటే ఆంధ్రావోళ్ళ పట్టుదలకి..సహనానికి హద్దుందా.. అనిపించింది. అందులోనూ మహిళలు ఒక పెద్ద ప్రభంజనంలా ముందుకొచ్చారు. పెద్ద సంగ్రామానికే తరలివచ్చినట్లు నారీమణులు వీరనారులై కదిలి వచ్చారు. పురుషుల కంటే తామేమీ తీసిపోయేది లేదంటూ ఏకంగా 4లక్షలా 78 వేల మంది దాకా స్త్రీ ఓటర్లే వచ్చి 'ఓటు' వజ్రాయుధాన్ని చేతపట్టి తమ ధీరత్వాన్ని చాటారు. 'బాబోయ్!.. ఆంధ్రా ఓటర్లంటే సామాన్యులు కాదు' అని దేశమంతా నోరెళ్ళబెట్టేలా, ఓటు హక్కు వినియోగంలో 'ఆ.. అంటే ఆంధ్రాయేననిపించేలా' కేక పుట్టించారు.

సార్వత్రిక ఎన్నికల 4వ దశ 'ఆంధ్ర ఎన్నికలు' దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రాష్ట్రంలో ఈ ఎన్నికలు కీలకంగా మారిన తరుణంలో ఓటర్లు చైతన్యవంతులు కావాలని అందరూ ఆశించారు. ఎన్నికల అధికారులు, అధికార యంత్రాంగమంతా ఓటర్లను ఓటేసేలా ప్రోత్సహించడానికి చేయాల్సినదంతా నిర్విరామంగా, శక్తివంచన లేకుండా చేశారు. ఫలితం..అద్భుతం! అనుకున్న దానికంటే పండ్లచెట్టు మీదనుంచి గలగలా రాలిన పండ్లలా బాక్కులన్నీ నిండిపోయాయి. గత ఎన్నికల్లో కంటే ఈసారి రికార్డులన్నీ బదాబదల్ చేస్తూ 26 లక్షల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా ఈనెల 15న అమరావతిలో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పారు.

### పోస్టల్ బ్యాలెట్‌లలో 4.97 లక్షల ఓట్లు

ఉద్యోగులు వేసే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఈసారి ఎక్కడా తిరస్కరణకు గురికాకుండా... దాదాపు అందరూ ఎంతో నిబద్ధతతో ఓటు వేయడం గమనార్హం. గత ఎన్నికల్లో దాదాపు 56వేల పోస్టల్ బ్యాలెట్లు తిరస్కరణకు గురైతే, ఈసారి అలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. గత ఎన్నికల్లో 2.62 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకుంటే, ఈసారి 4.97లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారంటే, రాష్ట్రంలోని ఉద్యోగులు ఎంత బాధ్యతాయుతంగా ఓట్లు వేశారో తేటతెల్లమవుతుంది.

### పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి.. మొత్తం పోలింగ్ 81.86 శాతం

పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి ఈ ఎన్నికల్లో మొత్తం పోలింగ్ శాతం 81.86గా నమోదైంది. రాష్ట్రంలో మొత్తం 4,13,33,702 మంది ఓటర్లుంటే, అందులో 3,33,40,560 ఓట్లు లోక్‌సభకు పోలయ్యాయి. 3,33,40,333 ఓట్లు అసెంబ్లీకి వేసిన ఓట్లుగా నమోదయ్యాయి. ఈవీఎంల ద్వారా పురుషులు 1,64,30,359 మంది ఓట్లు వేస్తే, స్త్రీలు అంతకంటే ఎక్కువగా 1,69,08,684 మంది ఓటేశారు. ఇతరులు మరో 1517 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందుకే, 'రాష్ట్ర చరిత్రలోనే ఇంత భారీస్థాయిలో ఓట్లు నమోదవడం ఇదే తొలిసారి'..అని ఎన్నికల ప్రధానాధికారి ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో కూడా ఈసారి ఉద్యోగులు ఎంతో అప్రమత్తంగా ఉండడం విశేషం.

### లోక్‌సభ ఓట్లలో..ఒంగోలు ఫస్ట్

ఈ ఎన్నికల్లో లోక్‌సభకు పోలైన ఓట్లలో రాష్ట్రంలో ఒంగోలు అగ్రగామి అయింది. అక్కడ అత్యధికగా 87.06 శాతం ఓట్లు రాగా, అత్యల్పంగా విశాఖలో 71.11శాతం వచ్చాయి. అయితే, గత ఎన్నికల్లో విశాఖలో 67 శాతం నమోదైతే, ఈసారి 71.11 శాతం జరగడంతో గత ఎన్నికల్లో కంటే ఎక్కువ ఓట్లు పోలైనట్లే. అదేవిధంగా శాసనసభా నియోజకవర్గాల్లో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 90.91శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం పోలింగ్ జరిగింది. తిరుపతిలో గత ఎన్నికల్లో కంటే ఈసారి తక్కువ పోలింగ్ జరిగింది. 65.9 శాతం నుంచి 63.32 శాతానికి తగ్గింది. 16పార్లమెంట్ స్థానాల్లో 80 నుంచి 90 శాతం పైగానే పోలింగ్ జరిగింది. 9 పార్లమెంట్ స్థానాల్లో 80 శాతం కన్నా తక్కువ పోలింగ్ నమోదైంది.

### అసెంబ్లీ ఓట్లలో.. 70 శాతానికి పైగానే పోలింగ్ :

ఈ ఎన్నికల్లో 117 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 80 నుంచి 90 శాతం దాకా పోలింగ్ నమోదు కావడం భారీ మార్పేనని అనుకోవచ్చు. 41 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70 నుంచి 80 శాతం దాకా, 17 నియోజకవర్గాల్లో 63 నుంచి 70 శాతం దాకా పోలింగ్ నమోదైంది. దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో 90.91శాతం పోలింగ్ జరిగి అత్యధిక స్థానంలో నిలిచింది. 89.99 శాతంతో జగ్గయ్యపేట, 89.88 శాతం పోలింగ్‌తో కుప్పం మూడవ స్థానంలో నిలవగా, తిరుపతిలో అత్యల్పంగా 63.32శాతం పోలింగ్ నమోదైంది. దాదాపు 158 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70 శాతానికి పైగానే పోలింగ్ జరిగింది.

### అర్ధరాత్రి 2 గంటలదాకా పోలింగ్

దాదాపు 3,500 పోలింగ్ కేంద్రాల్లో చివరి రెండు గంటల ముందు ఓటర్లు తరలి రావడంతో.. నిర్ణీత సమయమైన సాయంత్రం 6 గంటలు దాటినా అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది. చివరి పోలింగ్ కేంద్రంలో అర్ధ రాత్రి 2 గంటలకు పోలింగ్ ముగి సిందని ఎన్నికల ప్రధానాధికారి చెప్పారు. మొత్తంగా 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను అన్నిటినీ స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచామన్నారు.

### 25 లోక్‌సభ స్థానాల్లో.. పోలింగ్ శాతం..

రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ శాతం ఇలా ఉంది. అరకు (ఎస్టీ)లో 73.68, శ్రీకాకుళంలో 74.43, విజయనగరంలో 81.05, విశాఖలో 71.11, అనకాపల్లిలో 82.03, కాకినాడలో 80.30, అమలాపురం(ఎస్‌సి)లో 83.85, రాజమండ్రిలో 80.93, నరసాపురంలో 82.59, ఏలూరులో 83.68, మచిలీపట్నంలో 84.05, విజయవాడలో 79.37, గుంటూరులో 79.81, నరసరావుపేటలో 85.65, బాపట్ల (ఎస్‌సి)లో 85.48, ఒంగోలులో 87.06, నంద్యాలలో 80.61, కర్నూలులో 76.80, అనంతపురంలో 80.51, హిందూపురంలో 84.70, కడపలో 79.57, నెల్లూరులో 79.05, తిరుపతి(ఎస్‌సి) 79.10, రాజంపేటలో 79.09, చిత్తూరు(ఎస్‌సి)లో 85.77 శాతం పోలింగ్ నమోదైంది.



లాయర్
మే 17, 2024

# జలమే.. జగతికి జీవనాధారం

'సకల మానవాళికే కాదు.. పశుపక్ష్యాదులకు, అనేక జీవ రాశులకు కూడా నీరే ప్రాణాధారం'. ఒక్క మాటలో చెప్పాలంటే.. జలమే జగతికి జీవనాధారం! అయితే, మన దేశంలో అనేక ప్రాంతాల్లో నీటి వనరులు పరమ అధ్వాన్నస్థితిలో ఉంటున్నాయి. నీళ్ల లేక దేశంలోని అనేక ప్రాంతాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ మండే ఎండల్లో ఎన్నెన్నో బాధలు పడుతున్నారు. ఎప్పుడు వేసవి వచ్చినా ఇదే దుస్థితి. సామాన్యులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులకు తగిన శ్రద్ధ లేకపోతుండడంతో ఏఏటికాయేడు ఈ కష్టాలు వస్తూనే ఉన్నాయి. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇప్పటికీ మహిళలు, వృద్ధులు సైతం మైళ్ల దూరం నడిచి బిందెలు, కడవలు, కావిళ్ళతో ఒక పక్క నీళ్లని, మరోపక్క కన్నీళ్ళని మోసుకుంటూ బతుకులీడుస్తూనే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచిపోతున్నా, ప్రజలందరికీ మంచి నీళ్లు దొరక్కపోవడం ఏమిటి?.. ఇంకా ఎంతకాలమిలా?... నీటి కరువుతో ప్రజలు ఎంతగా బాధలు పడుతన్నా పట్టించుకోకపోవడం న్యాయమా?.. ఒకవైపు ప్రకృతి కన్నెర్రతో ఎండలు మండిపోతుండడం, భూమండలం అగ్నిగోళంగా మారుతుండడం అందరికీ తెలిసిందే. పదేళ్ళ క్రితం 30 నుంచి 35 డిగ్రీల దాకా ఉన్న ఉష్ణోగ్రతలు ఇప్పుడు 45 నుంచి 50 డిగ్రీల దాకా ఉంటున్నాయి. రోడ్ల మీద నడస్తుంటే నిప్పుల మీద నడుస్తున్నట్లే ఉంది. కొండకోనలు సైతం ఎండిపోతున్నాయి. అక్కడున్న వృక్షజాతులు ఎండిపోతుంటే, జంతువులు పక్షులు నీళ్ల కోసం గ్రామాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ, కొందరు అక్రమార్కులు మాత్రం తమ స్వార్ధానికి ప్రకృతి సంపదనంతా అందినకాడకి దోచుకుపోతుంటే, కనీసం గుక్కెడు నీటికి కూడా నోచుకోకుండా అనేకప్రాంతాల్లో నిరుపేదలు అల్లాడిపోతున్నారు. ఎండల్లో మూగజీవాలు గొంతెండి పోకుండా అటవీ ప్రాంతాల్లో నీళ్ల తొట్లు ఏర్పాటుచేయాల్సిన అవసరాన్ని కూడా ఎవరూ పెద్దగా గుర్తించడం లేదు. నీటివనరులను కాపాడుకోవాలని, ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టుకోవాలని అందరూ చెప్తుంటారే తప్ప, ఆచరణలో ఎవరి నిర్లక్ష్యం వారిదే. వర్షాలు వచ్చినప్పుడు ఆ నీరు వృధా కాకుండా ఎక్కడికక్కడ చెక్ డ్యామ్‌లు కట్టుకుని, వేసవిలో భూగర్భజలాలు తగ్గకుండా చూసుకోవాలని నిపుణులు చెప్తున్నా ఎవరు పట్టించుకుంటున్నారు గనక?!..నదుల అనుసంధానం అన్నది ఇప్పటి మాట కాదు. ఎప్పుడో బ్రిటీష్ వారి కాలం నుంచి వస్తున్నదే. సర్ ఆర్థర్ కాటన్ వంటి మహనీయులు నదుల అనుసంధానం వల్ల సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఉండవని ఎంతో ముందుచూపుతో తగు ప్రతిపాదనలు చేసినా ప్రభుత్వాలు వాటిని అటకల మీదనుంచి కిందికి దించడం లేదు. పైపెచ్చు కాలువలు ఆక్రమించుకోవడం, చెరువులు దొరువులన్నిటినీ ఎక్కడ వీలు దొరికితే అక్కడంతా కబ్జా చేసేయడం ఎంతోకాలంగా జరుగుతోందే తప్ప, ఆ దురాక్రమణలను అడ్డుకునే వారే ఉండడం లేదు. కాలువల్లో గుర్రపుడెక్క,కలుపు వంటివి పెరిగిపోయి పొలాలకు నీటిపారుదల సక్రమంగా లేకున్నా, వాటి పూడికతీత అన్నదే జరగడం లేదు. భూగర్భజలాల నీటిమట్టం తరిగిపోతున్నా, కొన్ని చోట్ల ఎవరిష్టం వచ్చినట్లు వారు విచక్షణారహితంగా వందల అడుగుల లోతుకు బోర్లు వేసేసుకుంటున్నా అడిగే వారు లేరు. వర్షపు నీటిని వృధా చేయకుండా ఒక ప్రణాళిక ప్రకారం నీటిని పొదుపు చేసుకోగలిగితే, కాలువలకు-చెరువులకు లింక్ కెనాల్స్ ఏర్పాటుచేసి, నీటిని నిల్వ చేసుకోగలిగితే ప్రజలకు తాగేందుకు మంచినీటికి ఇబ్బంది ఉండదని నిపుణులు ఎంతోకాలంగా చెప్తున్నా వినేవారే లేరు. ఇక నీటి పారుదల ప్రాజెక్టులంటేనే అవినీతికి, అక్రమాలకు మారుపేరుగా మారుమోగుతున్నాయే తప్ప, ఏదీ సక్రమమైన దారిలో నడవడం లేదు. గత రెండుమూడు సంవత్సరాలుగా అదనుకు పదునైన వర్షాలు కురవకపోవడం, పల్లెల్లోని పంటపొలాలు బీడుపట్టిపోతుండడం, తాగేందుకు నీరు లేకపోవడం జరుగుతున్నా, నీటి కరువు నివారణకు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు కానీ, పాలకులకు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బెంగుళూరు, చెన్నై వంటి మహానగరాల్లో కూడా మంచినీటికి ప్రజలు కటకటలు పడుతూనే ఉన్నారు.

ఇకనైనా కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడెక్కడ నీటివనరులున్నాయో..వాటి పరిస్థితి ఏమిటో నివేదికలు తెప్పించుకుని, పరిస్థితులను సమీక్షించాలి. పరిశుద్ధమైన నీటిని అందరికీ అందించేలా పథకాలను రచించాలి. జలవనరులను కాపాడడం, ఆక్రమణలను, అక్రమాలను శాశ్వత ప్రాతిపదికపై నిరోధించి, నీటి వనరుల పరిరక్షణకు కంకణబద్ధులు కావడం ముఖ్యం! గుక్కెడు నీళ్ళ కోసం ప్రజలు అలమటించే దుస్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనావుంది!...




# 'హమ్మయ్యా!.. ఎన్నికలు ముగిశాయి!

'హమ్మయ్య!.. ఎన్నికలైపోయాయి.. ప్రశాంతంగా జరిగాయి'.. అంటూ అటు అధికారులు, ఎన్నికల్లోని నాయకులే కాక, ప్రజలు కూడా ఊపిరి పీల్చుకున్నారు. అసలే భయంకరమైన ఎండలు. ఈ మండుటెండల్లో వృద్ధులు ఓటింగ్‌కు రావాలంటే కష్టమే కదా! వస్తారో రారో?..అనుకుంటున్న తరుణంలో ఓటర్లు భారీఎత్తున పోలింగ్‌కు తరలిరావడం ఎంతైనా విశేషం. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు నువ్వా-నేనా అన్నట్లు తలపడుతున్న నేపథ్యంలో, అక్కడక్కడా చెదురుమదురు ఘటనలున్నా, పెద్దగా హింసాత్మక సంఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడం హర్షదాయకం. అయిదేళ్లకోసారి వచ్చే ఈ సార్వత్రిక ఎన్నికలు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఒకటైన మనదేశంలో సజావుగా నిర్వహించడం కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక పెద్ద సవాలేనని చెప్పక తప్పదు. దేశవ్యాప్తంగా జరిగే ఈ ఎన్నికలకు బృహత్తరమైన ప్రణాళికతోపాటు, ఎన్నో కీలకమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటినుంచి, నామినేషన్ల పర్వం, ప్రచార పర్వాలు దాటుకుని ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చేవరకు ప్రతి దశలోనూ పెద్దఎత్తున కసరత్తు చేయాల్సిందే. మధ్య మధ్యలో నోట్లకట్టల్ని, మందుబాటిళ్లను, ఇతరత్రా తాయిలాలను పంచడానికి రహస్యంగా వాటిని తరలిస్తున్న అక్రమార్కుల ఆటకట్టించేందుకు పోలీసులు ఇరవైనాలుగు గంటలూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తూనే ఉండాలి. పోలింగ్ రోజునైతే ఇక అందరి దృష్టీ దానిపైనే. అభ్యర్థుల కంటే అధికారులకే ఎన్నికలంటే క్షణక్షణం ఉత్కంఠ. ఒకటే టెన్షన్. ముఖ్యంగా, ప్రధాన రాజకీయ పార్టీలు హోరాహోరీగా ఎన్నికల బరిలో దిగుతున్నప్పుడు ఎలాంటి గొడవలు, ఘర్షణలు లేకుండా ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఎలాంటి ప్రమాదం జరుగుతుందో చెప్పలేం. అలాంటి వాటినన్నిటినీ జాగ్రత్తగా గమనిస్తూనే మరోవైపు, ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఎంతో ముందుజాగ్రత్తగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో అన్ని దశల్లోనూ ఎన్నికల సంఘం తన బాధ్యతలను దిగ్విజయంగా నిర్వహించిందనే చెప్పవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగానే జరిగింది. ఓటర్లు పెద్దసంఖ్యలో ప్రయాణిస్తున్న నాందేడ్-విశాఖపట్నం రైలు ఆలస్యంగా నడుస్తుంటే, ఓటుకు సమయం మించిపోతుందేమోనని సుమారు 800 మంది ఓటర్లు కలవరపడుతుంటే, ఆ సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి స్పందించి, ఆ రైలుకు ఆగమేఘాల మీద గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేయించి, పోలింగ్ సమయానికి ముందే విశాఖలో ఉండేలా ఆ రైలును పరుగులు తీయించారంటే ఎన్నికల సంఘం ఓటర్ల పట్ల ఎంత అప్రమత్తంగా ఉందో.. ఇదొక ప్రత్యక్ష నిదర్శనం. ఏదేమైతేనేం..సమయానికి ఎట్టకేలకు అందరూ అత్యంత ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఓటింగ్ ప్రక్రియ పూర్తయి, ఓట్ల పెట్టెలు త్వరలో (జూన్ 4) జరుగనున్న లెక్కింపు కోసం స్ట్రాంగ్‌రూమ్‌లకు భద్రంగా చేరుకోవడం దాకా ఎన్నికల అధికారులు, పోలీసులు తీసుకున్న చర్యలు అందరి ప్రశంసలకు పాత్రమయ్యాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## వెల్లువెత్తిన 'ఓటు' చైతన్యం :

ఈ ఎన్నికల్లో ముఖ్యంగా మన రాష్ట్రంలో కనీవినీ ఎరుగని విధంగా ఓట్ల పోలింగ్ శాతం పెరగడం, ప్రజల్లో ఓటు విలువ పట్ల, ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలనే మహదాశయం పట్ల ప్రజా చైతన్యం వెల్లువెత్తడం హర్షదాయకం. తామెంతో దూరంలో.. ఏ వూళ్లోనో.. ఏ నగరంలోనో ఉన్నా కూడా వ్యయప్రయాసలని అనుకోకుండా ఈ ఎండల్లో అంతంత దూరాల నుంచి వచ్చి ఓటేసిన వాళ్లెంతోమంది ఉన్నారు. తామెక్కడ ఉన్నా ఆ సమయానికి వచ్చి ఓట్లేయడం, తమ ఓటు హక్కును వినియోగించుకోవడం హర్షదాయకం. మే 13 అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ఓటింగ్ జరిగిందంటే ఓటర్లు ఎంత ఓపిగ్గా వేచివుండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారా అనిపిస్తుంది. మంగళవారం నాటి ప్రాథమిక అంచనాల ప్రకారం డా.అంబేద్కర్ కోనసీమలో అత్యధికంగా 83.19 శాతం, అత్యంత తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 63.19 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారిక అంచనాలను బట్టి తెలుస్తోంది. నెల్లూరుజిల్లాలో 78.10 శాతం, తిరుపతి జిల్లాలో 76.83 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి సుమారు 82.37 శాతం దాకా పోలింగ్ నమోదైందని అంటున్నారు. నమోదు శాతాన్ని పూర్తిస్థాయిలో లెక్కకడితే, అది ఇంకాస్త పెరిగే అవకాశం కూడా ఉందంటున్నారు. అంతేకాదు, రాష్ట్రంలో 4,14,01,887 మంది ఓటర్లుంటే అందులో 4,44,218 మంది పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా చెప్పుకోదగ్గ విశేషం. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్ర చరిత్రలోనే ఇంత భారీగా ఓటింగ్ జరగడం ఇదే తొలిసారంటే అతిశయోక్తి కాదు.

ఏదేమైనా, అభ్యర్థుల బలాబలాల కన్నా, పార్టీలు-నాయకుల బలం కన్నా, ఓటు బలం ఎంతగా పెరిగిందో ఈ ఎన్నికలే ఒక ఉదాహరణ అనుకోవచ్చు. ఇక దాని అసలు శక్తి ఏమిటో.. 'ఓటు' ప్రభావం ఇంకా ఎంత బలీయంగా ఉంటుందో.. జూన్ 4న మరింత స్పష్టంగా తేటతెల్లమవుతుంది.

- రాజశ్రీ

# పెరిగిపోతున్న అక్రమాలు

ఎన్నికలొస్తే చాలు.. రాజకీయ రంగంలో అక్రమాలు పెరిగిపోతూనే ఉన్నాయి. ఈ విషయం బహిరంగ రహస్యమే అయినప్పటికీ, ఎవ్వరూ చేయగలిగిందేమీ లేదు. ఎన్నికల్లో మంచి నేతలను ఎన్నుకోవడం ఒక్కటే దీనికి మార్గం. కానీ, ఇలాంటి కీలక ఎన్నికల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో డబ్బు పంపకాలు భారీ ఎత్తున జరిగాయన్న వార్తలు వింటుంటే.. ఇదేనా మన ప్రజాస్వామ్యం అనిపిస్తోంది. ఓటుకు నోటు మంచిది కాదని తెలిసినా.. కొంతమంది నాయకులు ఓటుకు 2వేలు, 3వేలని విలువకట్టి ఓటర్లకు ఎరవేశారు. స్వార్ధ రాజకీయాలు పెరిగిపోవడంతో నాయకులిచ్చిన డబ్బును ఇదే అదనుగా క్రిందిస్థాయి నాయకులు తెగ మింగేశారని ఎక్కడ చూసినా వదంతిగా ఉంది. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కూడా డబ్బులిస్తే తప్ప ఓట్లు వేసేది లేదని చెప్పే పరిస్థితి ఎదురైంది. ఆ పార్టీ మాకు డబ్బులిచ్చింది... మీ పార్టీ మాకు డబ్బులివ్వలేదని సంబంధిత పార్టీ నేతలతో గొడవకు దిగిన సంఘటనలు కూడా అక్కడక్కడా కనిపించడం విచారకరం.

కే.ఎస్.రంగయ్య, గూడూరు.

# నిర్లక్ష్యంగా రైలు పట్టాలు దాటొద్దు

రైలు పట్టాలు దాటడం ప్రాణాలకే ప్రమాదకరం అని తెలిసిందే! అయినప్పటికీ నిత్యం ఎక్కడో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల ఎన్నికల విధుల కోసం వెళ్తున్న ఒక తల్లి కావలి వద్ద రైలు పట్టాలు దాటుతూ ప్రమాదానికి గురై మరణించడం, తల్లిని కాపాడుకోవాలని ప్రయత్నించి కొడుకు కూడా మృత్యువాత పడడం ఎంతైనా బాధాకరం. పగలు రాత్రి తేడాలేకుండా అనేకమంది ఇప్పటికీ రైలు పట్టాలను నిర్లక్ష్యంగా దాటేస్తుంటారు. రైలు కనిపించడం లేదు కదా అని పట్టాల మీద నడుస్తుంటారు. ఇటీవలికాలంలో బాగా వేగంగా ప్రయాణించే రైళ్లు పట్టాలెక్కడంతో ప్రజలు పట్టాలు దాటకుండా జాగ్రత్త వహించాలి. ప్రమాదాలు జరిగాక బాధపడి ప్రయోజనం ఉండదు. ఎవరికి వారు ఈ విషయంలో అవగాహన కలిగించుకోవాల్సిన అవసరం ఉంది.

వి.ప్రవల్లిక, కావలి.

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

జిల్లాలో అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల విద్యుత్ తీగలు చేతికందేలా కనిపిస్తున్నాయి. పొరపాటున ఏ మూగజీవాలు వాటికి తగిలినా ప్రాణాలు పోవడం తథ్యం. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ తీగలు వేలాడుతుంటాయి. ఇళ్ళ మీదుగా వేసివున్న విద్యుత్ తీగలు కూడా చేతికందేలా ఉన్నాయి. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు సంబంధిత సిబ్బందితో పర్యటించి వాలిపోయి ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలి. విద్యుత్ తీగల వల్ల ప్రమాదం జరగకుండా తగిన చర్యలు చేపట్టాలి.

ఎస్.ప్రభాకర్, మనుబోలు.



## 19 నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు

**• భారీఎత్తున ఏర్పాట్లు**

జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన రాపూరు మండలం పెంచలకోనలో వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ ఉత్సవాలకు భారీసంఖ్యలో భక్తులు తరలి రానుండడంతో అధికారులు, ఆలయ నిర్వాహకులు అందుకు తగ్గట్టుగా పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో, చలువపందిళ్ళతో నయనానందకరంగా తీర్చిదిద్దారు. ఈనెల 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 19వ తేది సాయంత్రం 6 గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 20వ తేదీ ఉదయం ఆలయప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, పూలంగిసేవ, తిరుచ్చి ఉత్సవంచేసి ధ్వజారోహణం గావిస్తారు. రాత్రి 9గంటలకు శేషవాహన సేవ నిర్వహిస్తారు. 21న ఉదయం 8 గంటలకు హంసవాహనసేవ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ, 22న నృసింహజయంతి సందర్భంగా ఉదయం 8 గంటలకు సింహవాహన సేవ, రాత్రి 11 గంటలకు బంగారు గరుడవాహన సేవ ఉంటాయి. 23వ తేది ఉదయం 9.35 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు గజవాహన సేవ ఉంటుంది. అదేవిధంగా 24వ తేది ఉదయం 7.30 గంటలకు వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, ఉదయం 11.40 గంటలకు స్వామివారి మూలమూర్తికి అభిషేక సేవ శోభాయమానంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి పుష్కరిణిలో తెప్పోత్సవం, రాత్రి 9 గంటలకు అశ్వవాహనసేవ ఉంటాయి. ఆదేరోజు రాత్రి 11 గంటలకు ధ్వజావరోహణ జరుగుతుంది. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి. అనంతరం, 25వ తేది శనివారం స్వామివారు పెంచలకోన నుండి గోనుపల్లికి చేరుకోగానే, అక్కడ పెద్దఎత్తున గ్రామస్తులు గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

**ఆలయానికి రూ.53.3 లక్షల ఆదాయం:**

పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 15న హుండీలను లెక్కించగా గత 54 రోజుల్లో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.533 లక్షలు ఆదాయంగా వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయసాగర్ తెలిపారు. బంగారు 230 గ్రాములు, వెండి 2.9 కేజీలు హుండీల ద్వారా లభించాయని, పలు దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు కూడా హుండీల్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో సూళ్ళూరుపేట చెంగాళమ్మ దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా దేవాదాయశాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

## రామానుజాచార్యుల వారి జీవితం..స్ఫూర్తిదాయకం



భగవత్ రామానుజుల వారి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా సామాజిక సమరసతా వేదిక నిర్వాహకులు కోదూరు సత్యం చెప్పారు. రామానుజాచార్యుల జయంతి సందర్భంగా, ఈనెల 12న నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో ఉన్న ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రాజేంద్ర, జయప్రకాష్, సతీష్, మల్లికార్జున, కేశవులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా అదేరోజున భగవత్ రామానుజుల వారి జయంతిని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి, రామానుజుల వారి గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

## శ్రీ శంకరాచార్య సంస్మరణ వారోత్సవాలు

జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల వారి సంస్మరణ వారోత్సవాలను ఈనెల 18 నుంచి 24వతేది వరకు నెల్లూరులోని పొగతోటలో ఉన్న శ్రీ ఆదిశంకర ధ్యానమందిరంలో నిర్వహిస్తామని చక్రాల వారి ట్రస్ట్ మేనేజర్ చక్రాల వేంకటనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిలోని జాతీయ కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఒరుగంటి శ్రీరామలాలశర్మ వారిచే ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు 'చతుస్సూత్రి' భాష్యప్రవచనం, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు 'దశ శ్లోకీ విచార:' ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్తలు, సాహిత్యాభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

# జిల్లాలోనూ భారీ పోలింగ్

**• 79.63 శాతం నమోదు**



ఈ సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరుజిల్లాలోనూ భారీస్థాయిలో పోలింగ్ జరిగింది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు దంచికొట్టారు. మొత్తంగా 79.63 శాతం నమోదుతో ఓట్ల లెక్క బుధవారానికి స్పష్టమైంది. జిల్లాలో అత్యధికంగా కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 88.96 శాతం ఓట్లు నమోదు కాగా, అత్యల్పంగా నెల్లూరు రూరల్‌లో 67.76 శాతం నమోదైంది. సర్వేపల్లి నియోజకవర్గంలో 83.88 శాతం, కావలిలో 83.03 శాతం, ఆత్మకూరులో 83.49 శాతం, కోవూరులో 79.29 శాతం, నెల్లూరు నగర నియోజకవర్గంలో 71.72 శాతం, ఉదయగిరిలో 81.92 పోలింగ్ జరిగినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. గత ఎన్నికల కంటే ఈసారి సుమారు 2 శాతం పైగానే పోలింగ్ శాతం పెరిగింది కూడా. 2019 ఎన్నికల్లో అసెంబ్లీ–పార్లమెంట్ కలిపి 76.91శాతం పోలింగ్ నమోదైతే, ఈసారి ఎన్నికల్లో అది 79.63 శాతమైంది. ఇది 2019 ఎన్నికలకంటే 2.72 శాతం ఎక్కువ. అదేవిధంగా 2019లో పురుషుల ఓటింగ్ 77.769 శాతం ఉంటే ఇప్పుడది 2.98 శాతం పెరిగింది. దీంతో పురుష ఓటర్ల ఓటింగ్ 80.67 శాతమైంది. అదేవిధంగా, 2019లో మహిళల ఓటింగ్ 76.83 శాతం ఉంటే, ఇప్పుడది 79.37గా నమోదు కావడం విశేషం. ఈ ఎన్నికల్లో జిల్లాలోని మహిళలు పెద్దఎత్తున పోలింగ్‌బూత్‌ల వద్దకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకం. గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో ఓటు చైతన్యం బాగా పెరిగింది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఓటింగ్ శాతం పెరిగింది.

**కందుకూరు ఫస్ట్:**

మొత్తంగా జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్‌ను పరిశీలిస్తే.. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,28,913 మంది ఓటర్లుంటే 2,03,637 మంది ఓటు హక్కు వినియోగించుకుని జిల్లాలోని ఫస్ట్ అనిపించుకున్నారు. కావలి నియోజకవర్గంలో 2,38,553 మంది ఓటర్లకు గాను 1,98,066 మంది, ఆత్మకూరులో 2,15,401 ఓటర్లకు గాను 1,79,829 మంది, కోవూరులో 2,67,345 మంది ఓటర్లకుగాను 2,11,976మంది, నెల్లూరు నగర నియోజకవర్గంలో 2,39,497 మంది ఓటర్లకు గాను 1,71,763 మంది, నెల్లూరు రూరల్‌లో 2,80,888 మంది ఓటర్లకు గాను 1,90,324 మంది, సర్వేపల్లిలో 2,32,011 మంది ఓటర్లకు గాను 1,94,618 మంది, ఉదయగిరిలో 2,41,677 మంది ఓటర్లకు గాను 1,97,970 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లో కలిపి 19,44,285 మంది ఓటర్లుంటే అందులో 15,48,183 మంది (79.63 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం.

## రక్తదానానికి స్ఫూర్తినిస్తున్న.. ఆర్టీసీ ఉద్యోగి

**• 61వ సారి రక్తదానం**



రక్తదానమంటే ప్రాణదానమేనని, మనంచేసే రక్తదానం వల్ల ప్రాణాపాయంలో ఉన్న రోగులను, బాధితులను బతికించవచ్చనే సదుద్దేశ్యంతో కావలి ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.రవికుమార్ గత 30 సంవత్సరాలుగా రక్తదానం చేస్తూ ఎంతో మందిని ఆదుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న ఆయన కావలిలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో 61వసారి రక్తదానం చేసి అందరి ప్రశంసలు పొందారు. అదేవిధంగా తండ్రి స్ఫూర్తితో, ఆయన కుమారుడు కొర్ల వెంకట చిరంజీవి కూడా రక్తదానం చేస్తుండడం అభినందనీయం. ఈ సందర్భంగా చిరంజీవి 6వ సారి రక్తదానం చేశాడు. వీరిద్దరినీ కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రావూరు శ్రీనివాసులు, సూపరింటెండెంట్ విజయకుమారి, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డా. బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ దాకారపు రవిప్రకాష్, రెడ్‌క్రాస్ సిబ్బంది వారి సేవాభావాన్ని కొనియాడారు.

## కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు ఆహ్వానం

నెల్లూరు సమీపంలోని కొత్తూరులో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 11వ తరగతిలో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

## అదాని వరల్డ్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**--- సీబీఎస్ఇలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత ---**



ముత్తుకూరు మండలం గోపాలపురంలో ఉన్న అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన సీబీఎస్ఇ పరీక్షల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. తమ స్కూల్ నుంచి ఆ పరీక్షలకు హాజరైనవారంతా ఉత్తీర్ణులయ్యారని, కల్కి సాయి హర్షిత్‌రెడ్డి అనే విద్యార్థి 490 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా, జిల్లాలో ద్వితీయ స్థానంలోనూ నిలిచాడని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. అదేవిధంగా, తమ విద్యార్థులు ప్రియాన్స్ దూబే 480 మార్కులతోను, విశాల్ 458 మార్కులతోనూ రాణించారని అంటూ ఆయన ఆ విద్యార్థులను అభినందించారు.

## 'నరసం' ఆధ్వర్యంలో మాతృదినోత్సవం



నెల్లూరులోని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం నగరశాఖ వారి ఆధ్వర్యంలో ఈనెల 12న మాతృదినోత్సవం ఘనంగా జరిగింది. ఆ సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త..నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని సప్తగిరి కాలనీ నివాసి ఆండాళ్‌ను ఘనంగా సన్మానించారు. పదేళ్ళ క్రితం జరిగిన ప్రమాదంలో ఒక కాలును కోల్పోయిన ఆండాళ్, నేటికీ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో భారత, భాగవతాది పురాణ గ్రంథాలను నిత్య పారాయణం చేస్తూ, ప్రవచనాలు చెప్పుండడాన్ని ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు. శ్రీలక్ష్మి, సుందరి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# నేదురుమల్లి సేవలు చిరస్మరణీయం

## పెద్దాయనకు జిల్లా కాంగ్రెస్ నేతల నివాళి



నాయకులకే నాయకుడు, రాజకీయరంగంలో మహాయోధుడు.. ఎందరికో మార్గదర్శకుడైన స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇటీవల నెల్లూరులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సభ జరిగింది. డీసీసీ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి, నెల్లూరుజిల్లా మాజీ కలెక్టర్ కొప్పుల రాజు (కె.రాజు), జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ తదితరులు పాల్గొని నేదురుమల్లిని స్మరించుకున్నారు. తొలుత, నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.రాజును స్థానిక సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్వాహకులు ఆశీర్వదించారు.

## జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన..

# ఎన్‌సిసి కేడెట్లు



భారత ప్రభుత్వం రక్షణ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ నేషనల్ కేడేట్ కార్ప్స్ నుంచి కేడేట్ వెల్ఫేర్ సొసైటీ మెరిటోరియస్ స్కాలర్ షిప్-2023కు నెల్లూరు నగరంలోని కెవిఆర్ ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి క్యాడేట్స్ సాయి చరిణి, తబొప్పూరి వకుళ ప్రవీణ్, కీర్తిపాటి హిమ వర్షిణి, మద్దెల మహీధర్, సాధినేని వెంకట సహస్ర, కంచర్ల వెంకట దినేష్‌లు ఇటీవల ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. విజయ్‌ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు తమ హర్షం వ్యక్తం చేశారు. లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే, సెకండ్ ఆఫీసర్..అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు సమక్షంలో ఆ కేడెట్లకు స్కాలర్‌షిప్‌ల చెక్కులను అందజేసి అభినందించారు.

# నెల్లూరు కబుర్లు

## శ్రీ రంగనాథునికి..శ్వేతఛత్ర ఉత్సవం



నెల్లూరుజిల్లాలోని ప్రసిద్ధ రంగనాయకక్షేత్రం.. రంగనాయకులపేటలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల12న శ్రీ భగవత్ రామానుజాచార్యుల వారి తిరునక్షత్రం సందర్భంగా, ఆలయ అర్చకులు స్వామివారికి బంగారు పల్లకిలో శ్వేతఛత్ర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం, శ్రీ రంగనాథస్వామి, శ్రీ రామానుజాచార్యుల వారి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి తిరుమంజన సేవ చేశారు. అనంతరం, రాత్రి స్వామివారికి-అమ్మవారికి పెద్దశేష వాహనోత్సవాన్ని, శ్రీ రామానుజాచార్యుల వారికి పేట ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.

## సీబీఎస్ఇలో సత్తాచాటిన 'రెయిన్‌బో'



ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న నెల్లూరు సమీపంలోని రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూల్ విద్యార్థులు టెన్త్ సీబీఎస్ఇలో తమ సత్తా చాటారు. ఈ పాఠశాలకు చెందిన ప్రాప్తి జైన్ 500 మార్కులకుగాను 495 మార్కులు సాధించి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలవడం విశేషం! ఈ స్కూలుకు చెందిన దియా మెహతా 484 మార్కులు, కె.రిషికరెడ్డి 479 మార్కులతో ఉత్తమశ్రేణిలో నిలిచి అందరి అభినందనలు అందుకున్నారు. తమ పాఠశాలలో మొత్తం 97 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైతే, విద్యార్థులందరూ ఉత్తీర్ణత పొందారని, 32 మంది 90 శాతం మార్కులు సాధించారని పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం తెలిపారు. తమ విద్యార్థులు మంచి ఆశయంతో ఉన్నతవిద్యలు అభ్యసించాలని ఆమె ఆకాంక్షించారు. ఆమెతోపాటు ప్రిన్సిపాల్స్ అనిగోపకుమార్, అరుణా స్వయంప్రభ, వైస్ ప్రిన్సిపాల్స్ సురేఖరెడ్డి, పద్మజ తదితరులంతా ఈనెల 14న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులందరినీ అభినందించారు.

## హరిహరమూర్తి అలంకారంలో..మూలస్థానేశ్వరుడు



నెల్లూరు మూలాపేటలో వెలసివున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో జరుగుతున్న వసంతోత్సవాల్లో భాగంగా ఈనెల 15న స్వామివారికి 'హరిహరమూర్తి అలంకారం' చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ పూజలకు పలగంటి వెంకటసుబ్బారావు ఉభయకర్తగా వ్యవహరించగా, ఆలయ ఇఓ వేణుగోపాల్ పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వసంతోత్సవ వేడుకల్లో మూలస్థానేశ్వరుని దర్శించుకున్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు వచ్చేశాయ్

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుని లాగిన్ నుంచి కానీ, లేదా విద్యార్థి పుట్టిన తేదీ ఉపయోగించి గానీ ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఈనెల 25 నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

## రెడ్ల ఐక్యవేదిక సమావేశం

నెల్లూరులోని కెవిఆర్ పెట్రోలు బంకు వద్ద ఉన్న ఓ హోటల్‌లో ఈనెల 12న రెడ్ల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన సమాజసేవాతత్పరుడు జెవస్ రెడ్డికి తొలుత నివాళులర్పించి, వివిధ రంగాల్లో ప్రముఖులైన పలువురు రెడ్డి సంఘీయులను ఘనంగా సన్మానించారు. కళాకారులు, కవులు, రచయితలను కూడా సత్కరించారు. 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీచేశారు. ఈ ఏడాది టెన్త్‌లో 591 మార్కులు సాధించిన నెల్లూరుకు చెందిన ఊటుకూరు చరణ్‌కుమార్‌రెడ్డికి ప్రోత్సాహకరంగా దాత వెందోటి ధనుంజయరెడ్డి 50వేల రూపాయలను బహుమతిగా అందజేశారు. రెడ్ల ఐక్యవేదిక నిర్వాహకులు లక్ష్మీనారాయణ, నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీ రమణారెడ్డి, నిర్మల నరసింహారెడ్డి, హైటెక్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిగ్రస్తులకు..టీకాలు సిద్ధం

జిల్లాలో టీబీ(క్షయవ్యాధి) నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టీబీ వ్యాధిగ్రస్తులకు టీకాలు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈనెల 16 నుంచి ఈ టీకాలు వేస్తారు. జిల్లాలోని 667 సచివాలయాల పరిధిలో నర్సింగ్ సిబ్బంది ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్ వేయాలని వైద్యశాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఆ మేరకు ఇప్పటికే 3 లక్షల డోసుల టీకాలు నెల్లూరుకు చేరుకోగా, వాటిని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశారు. తొలిదశలో ఎంపిక చేసిన వారికి టీకాలు వేస్తామని, నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించి జిల్లాను క్షయ రహిత జిల్లాగా చేయాలని కృషిచేస్తున్నామని జిల్లా క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ చెప్పారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న వైకాపా అభ్యర్థులు...


వేణుంబాక విజయసాయిరెడ్డి


ఖలీల్ అహ్మద్


ఆదాల ప్రభాకర్‌రెడ్డి


నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


మేకపాటి విక్రమ్‌రెడ్డి


బుర్రా మధుసూదన్‌యాదవ్


కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


మేరిగ మురళీధర్


కిలివేటి సంజీవయ్య

# నారాయణకు బాలయ్యసేన సన్మానం



మాజీమంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణను ఈనెల 15న బాలయ్యసేన నాయకులు, జిల్లా కన్వీనర్ వై.రవి, శ్రీధర్‌రెడ్డి, కేసీ కృష్ణ తదితరులు ఘనంగా సన్మానించారు. నెల్లూరులోని నారాయణ నివాసంలో వారు కలసి ఆయనకు కిరీటధారణ చేసి, శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ ఎన్నికల్లో నారాయణ గెలుపు ఖాయమని వారు ధీమాగా చెప్పారు. తమ కోసం శ్రమించిన బాలయ్య సేన నాయకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

# తల్లి స్పర్శ.. బిడ్డకు ఓ భరోసా



ప్రపంచ కంగారు మదర్‌కేర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న నెల్లూరు పొగతోటలోని రిచ్ ఆసుపత్రిలో చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎం.డీ, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు రవికుమార్ మాట్లాడుతూ, పుట్టిన బిడ్డలకు తల్లి స్పర్శ ఎంతో ముఖ్యమని, బిడ్డల ఎదుగుదలకు అదెంతో ముఖ్యమని ఆయన సూచించారు. కంగారు జంతువు ఏ విధంగా తమ బిడ్డను పొట్టలో దాచుకుని సంరక్షించుకుంటుందో అదేవిధంగా తల్లులు కూడా తమ బిడ్డలకు స్పర్శ ద్వారా భరోసా కల్పించాలని అన్నారు. అందుకే 'కంగారు మదర్ కేర్' పేరుతో ప్రపంచ ఆరోగ్యసంస్థ తల్లులకు అవగాహన దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తోందని చెప్పారు. తల్లి స్పర్శ బిడ్డకు ఎంతో ధైర్యాన్ని, స్వాంతనను కలిగిస్తుందన్నారు. శిశువు ఎదుగుదలకు తొలి నెల ఎంతో కీలకమన్నారు. చిన్నపిల్లల వైద్యులు నవ్యశ్రీ, హరీషా, అమృత, ఆసుపత్రి సీఇఓ భాస్కర్, మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవ విద్యార్థులకు 26న.. ప్రతిభా పురస్కారాలు

జిల్లాలో 2024 టెన్త్ పరీక్షలలో 475 మార్కులకుపైగా సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఈనెల 26న ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ళ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ మార్కుల జాబితాతో నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి భవనంలో ఆ రోజున జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు రావాలని ఆయన కోరారు.



## కన్యకాపరమేశ్వరికి
# ప్రత్యేక పూజలు

ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం.. అందరినీ చల్లగ కాపాడే శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 15న నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం చేసి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం మూల వర్లకు విశేష పుష్పాలంకారం చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.

## 45 కుటుంబాలకు..
# దాతల చేయూత

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం శ్రీ సీతారామ ధార్మిక సేవాసంస్థ వారు ఇటీవల ఆర్థికంగా వెనుకబడిన 45 పేద కుటుంబాల వారికి చేయూతనందించారు. దాతలు చిట్టమూరు రుక్మిణమ్మ, రామిరెడ్డి, మధుకిరణ్‌రెడ్డిల దాతృత్వంతో, సుమారు లక్షా 80వేల రూపాయలతో వారికి పల సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో దివి సీతారామచార్యులు, శ్రీనివాసాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు, విఖనసాచార్యులు, తమిరిశ అనంతాచార్యులు, డాక్టర్ దివి శ్రీనివాస్, డాక్టర్ వేణుగోపాల్, ఎం.శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సేవాతత్పరుడు జెఎస్ రెడ్డి

## వెంకయ్యనాయుడి నివాళి



జెఎస్ రెడ్డి సేవాతత్పరుడని, ఆయన మరణవార్త తనకెంతో ఆవేదన కలిగించిదని భారత పూర్వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఈనెల 15న బెంగుళూరులో జరిగిన జెఎస్ రెడ్డి ఉత్తరక్రియల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో వెంకయ్య మాట్లాడుతూ, జెఎస్ తనకు మంచి మిత్రులని, ఆయన మరణం తనకి తీరని లోటని అన్నారు. జెఎస్ రెడ్డి పరమపదించటం వారి కుటుంబానికి, వారి సంస్థకే కాదు.. సమాజానికి కూడా పెద్ద లోటని అన్నారు. 'పరోపకారార్థం మిథం శరీరం' అన్న పెద్దల మాటను ఆచరణలో చూపించిన గొప్ప మనిషి జెఎస్ రెడ్డి అని కొనియాడారు. వారు భౌతికశరీరంతో మన మధ్య లేనప్పటికీ, తాను చేసిన మంచిపనులతో, సేవా కార్యక్రమాలతో సంపాదించిన యశో శరీరంతో అందరి హృదయాల్లోనూ శాశ్వత స్థానం సంపాదించుకున్నారని, వారు తనకు మిత్రులు కావడం గర్వకారణమని చెప్పారు. జెఎస్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# వైకాపా గెలుపు ఖాయం

- రామ్‌కు శుభాకాంక్షలు చెప్తున్న నాయకులు



ఈ ఎన్నికల్లో గెలుపు వైకాపాదేనంటూ వెంకటగిరి నియోజకవర్గంలోని పలువురు నాయకులు ధీమా వ్యక్తం చేస్తూ, ఆమేరకు తమ నేతలకు శుభాకాంక్షలు చెప్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా, వెంకటగిరి నియోజకవర్గంలో వైకాపా గెలుపే లక్ష్యంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఇటీవల వెంకటగిరిలో ఆ నియోజకవర్గం వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలుసుకుని ముందస్తు శుభాకాంక్షలు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి వైకాపా నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి రామ్‌ను అభినందిస్తున్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న తెదేపా అభ్యర్థులు...



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



పొంగూరు నారాయణ



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



కాకర్ల సురేష్



ఆనం రామనారాయణరెడ్డి



ఇంటూరు నాగేశ్వరరావు



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కురుగొండ్ల రామకృష్ణ



పాశం సునీల్‌కుమార్



నెలవల విజయశ్రీ

# కొత్త ఋతువు రావాలి

జీవితం ఇప్పుడు సంక్లిష్ట సంవేదనాభరిత వాక్యమయింది
దాంపత్య జీవనవనంలో పుష్పించి తరించాలనే
యువత బతుకులు కల్లోల సేద్యాలవుతున్నాయి
బతుకులు పండాల్సిన వైవాహిక బంధాల
చుట్టూతా ఇసుకమేటల ఎడారి పరుచుకొంది
వధువుల నిరసన ధ్వనుల సయ్యాటలు విధ్వంసానికి ప్రతీకలై
ఓ వ్యవస్థ పతనానికి పరాకాష్టలుగా ప్రతినబూనాయి.
యువకుల స్థితిగతులు అగాధాల్లోంచి అగ్నుల సెగల్లోకి జారిపడ్డట్లయింది.
భక్తునికి భగవంతునికి అనుసంధానకర్త
'పూజారి' చెరచబడ్డ ఇనబింబమై అస్తమిస్తున్నాడు
అతగాడి బతుకు వసంతానికి కోయిలపాటలు చిగురించవు
అన్నం పెట్టే రైతన్నను క్రోటనుమొక్కను కత్తిరించినట్లు కత్తిరించేస్తున్నారు
ఫోర్తు ఎస్టేట్ పూదోటలో అసహాయ శూరులమై విహరిస్తాం
ఆ అక్షరాభిషేకానికి మనం కార్యకర్తలు కాలేకపోతున్నాం
వారి అచంచల ధారణాశక్తిని ఆఘ్రాణిస్తాం
ఆ కనురెప్పల పెంజీకటి పొరల్ని పెకిలించడానికి ఆయుధులం కాలేం
వారి అలుపు పాటకు తోడు నీడ కాలేం.
'డిగ్రీ'లు ఎండవేడిమిని కొలిచే కొలమానాలే కాని
పెళ్లి బాజాలు పలవరించలేని శూన్యపురాళ్ళవి
సౌరభ పరిమళాలు కావాల్సిన స్వయం ప్రకాశకుల
జీవితాలు సైతం శైథిల్యమై విస్తరిస్తున్నాయి.
వర్తమాన మహిళల మనోభీష్టాలు పూచి చిగురించాలంటే
'కాలం' సరికొత్త ఋతువును ప్రభవించాలి.
అప్పటివరకూ ఇంటికో ప్రసాదుల ప్రాబల్యం
అనకొండగా మిగుల్తుంది.
పెళ్లి కానితనం ఉరికొయ్యకు బందీని చేస్తుంది!



చిన్ని నారాయణరావు
9440202942

# స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు

## • పటిష్ట బందోబస్తుతో భారీఎత్తున భద్రత



రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈవియంలు, ఎన్నికల స్టాట్యూటరీ మెటీరియల్స్‌ను స్ట్రాంగ్ రూమ్స్‌లో పటిష్ట బందోబస్తు మధ్య మంగళవారం భద్రపరిచారు. సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ ముగియడంతో నెల్లూరు పార్లమెంటు, 8 నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, స్టాట్యూటరీటరీ కవర్లుతో పోలింగ్ అధికారులు, సిబ్బంది ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటుచేసిన రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్నారు. పోలింగ్ పూర్తి అయిన అనంతరం కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్ కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకోగా, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు ప్రత్యేక కంటైనర్లలో ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు,రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేసి స్ట్రాంగ్ రూముల్లో పటిష్ట బందోబస్తు మధ్య భద్రపరిచారు. జిల్లా కలెక్టర్ సోమవారం రాత్రి నుండి మంగళ వారం స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచే వరకు అక్కడే వుండి పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బదూరియా, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు

## వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్



వైసీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. ఈ నెల 13న పట్టణంలోని సనత్‌నగర్ వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిల్లకూరులో ఎన్నికల పోలింగ్ రోజు జరిగిన ఘటన ఎంతో కలచివేసిందన్నారు. టిడిపి వాళ్ళు విధ్వంసం సృష్టించి, మా నాయకులు, కార్యకర్తలపై అసత్య ప్రచారాలు చేయడం సబబు కాదన్నారు. గూడూరు నియోజకవర్గ చరిత్రలో ఇటువంటి ఘటన ఎప్పుడూ జరగలేదన్నారు. ఇలా చేయడం వలన గూడూరుకి మచ్చ ఏర్పడిందన్నారు. ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న ఎలక్షన్‌ను టిడిపి అల్లరిమూకలు రాద్ధాంతాలు చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇకనైనా ఇటువంటి చర్యలు మానుకోవాలని, వైసీపీ కార్యకర్తలు, నాయకుల జోలికొస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. రాబోయేది మా ప్రభుత్వమేనని, ఎమ్మెల్యేగా తాను గెలుస్తున్నానని మురళీధర్ ధీమాగా చెప్పారు. వైసీపీ మండల అధ్యక్షులు మల్లు విజయకుమార్‌రెడ్డి, నాశిన నాగులు, వాయిగండ్ల నాగరాజు, తాళ్ళూరు శ్రీనివాసులు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**



# ఎవ్వరినీ వదిలిపెట్టను

## తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఇటీవల గూడూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ తెదేపాకు ఎక్కువగా నమోదు అవుతుందని తెలిసి, కావాలనే చిల్లకూరు పోలింగ్‌బూత్‌లలో మా కార్యకర్తలను రెచ్చగొట్టి చేయి చేసుకొని, చిల్లకూరు ఎస్సై అంజిరెడ్డి చేత కొట్టించారని అన్నారు. జూన్ 4న రాబోయేది మా ప్రభుత్వమేనని, తాను ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, మా కార్యకర్తలు, నాయకుల జోలికొస్తే ఎవ్వరిని వదలను.. గుర్తు పెట్టుకోండి అంటూ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌పై మండిపడ్డారు. నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బాలకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల చల్లనిచూపు ఎవరికో!



గూడూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అత్యధికంగా ఉండటంతో.. వారి చల్లని దీవెనెలు ఎవరికో అన్న విషయంపై జోరుగా చర్చ సాగుతోంది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2,45,205 ఉండగా, వారిలో 1,26,007 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 98,016 మంది మహిళలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మహిళల ఆశీర్వాదం తమకే నన్న ధీమాలో ఉన్నారు. 13వ తేదీన జరిగిన పోలింగ్ ప్రక్రియలో కూడా పురుషుల కంటే ముందుగానే స్త్రీలు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఉత్సాహంగా ఓటు వేశారు.

# గూడూరు డివిజన్‌లో 144 సెక్షన్



గూడూరు సబ్‌డివిజన్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలకు విరుద్ధంగా నిరసనలు, ర్యాలీలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్తంభం కూడలి వద్ద ఈ నెల 15న విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసినా 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల రోజున చిల్లకూరులో జరిగిన ఘర్షణపై సమగ్ర విచారణ చేపట్టి, ఘర్షణకి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ, గ్రామీణ సీఐలు పాపారావు, వేణుగోపాల్‌రెడ్డి, రవికిరణ్, ఎస్సై శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# కందనూరు సేవలు అపూర్వం



గూడూరుకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు, సాహిత్యాభిలాషి కందనూరు సీతారామయ్య (85) ఈ నెల 8న చెన్నైలో మృతి చెందారు. నెల్లూరుజిల్లా లేబూరుకు చెందిన సీతారామయ్య 1950 సంవత్సరంలో మద్రాసులో వైద్య విద్యనభ్యసించి, అనంతరం నెల్లూరు, గూడూరులలో వైద్యవృత్తిని సాగించారు. గూడూరులో 45 సంవత్సరాల పాటు ఆయన అందించిన సేవలు అపూర్వం. అప్పటి మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రం ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. చెన్నపురి ఆంధ్ర విద్యార్థి సమితిలో కీలక కార్యకర్తగా వ్యవహరిస్తూ, హేమాహేమీలైన ప్రకాశం పంతులు, తెన్నేటి విశ్వనాథం, బెజవాడ గోపాల్‌రెడ్డి, నీలం సంజీవరెడ్డి వంటి గొప్ప నేతల్ని అనుసరించిన వారిలో కందనూరు సీతారామయ్య ముందుండేవారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది 'లాయర్'.

# వేడుకగా.. వేదగిరీశుని బ్రహ్మోత్సవాలు

## • విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానంగా నరసింహకొండ

## • వేలాదిగా తరలివస్తున్న భక్తజనులు



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై భక్తులకు కొంగు బంగారంగా వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేది గురువారం నాడు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కావడంతో జిల్లానుంచే కాక, ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తజనులు నరసింహకొండకు తరలివస్తున్నారు. అత్యంత రమణీయమైన ప్రకృతి వాతావరణంలో, కొండపై కొలువుదీరివున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని తరించేందుకు జనం తండోపతండాలుగా వచ్చి ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అధికారుల అధ్వర్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో, పూలమాలికలతో శోభయామానంగా తీర్చిదిద్దారు. ప్రతినిత్యం స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు, విశిష్ట సేవలు నిర్వహిస్తున్నారు. మరోవైపు, ఆలయానికి వేలాదిగా వస్తున్న భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ఆమేరకు బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆలయ ఇఓ గిరికృష్ణతో కలిసి ఆర్డీఓ మలోలా ఇటీవల ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

### 21న బంగారు గరుడసేవ :

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 16న గురువారం నాడు అంకురార్పణ జరిగింది. 17వ తేది శుక్రవారం ఉదయం అంగరంగవైభవంగా ధ్వజారోహణ ఉత్సవం జరుగనుంది. అదేవిధంగా, ఈనెల 18న హంసవాహన సేవ, 19న సింహవాహనసేవ, 20న హనుమంత సేవ నిర్వహించనున్నారు. ఈనెల 21వ తేదిన మరింత వైభవంగా బంగారు గరుడసేవ ఉత్సవం జరుగనుంది. రాత్రికి శేషవాహనోత్సవం ఉంటుంది. 22న కల్యాణోత్సవం, గజవాహనసేవ, 23న రథోత్సవం, 24న అశ్వ వాహన సేవలను కన్నులపండువగా నిర్వహిస్తారు. నరసింహకొండపై ప్రాచీనకాలం నుంచి ఉన్న ఎంతో పవిత్రమైన సప్త కోనేర్ల వద్ద 25వ తేదీన తీర్థవాది ఉత్సవం జరుగనుంది. ఈ ఉత్సవాల అనంతరం ఉత్సవాల ముగింపు సూచకంగా 25న ధ్వజావరోహణం జరుగుతుంది. 26వ తేదీన స్వామివారికి -అమ్మవారికి పెద్దఎత్తున పుష్పయాగం చేస్తారు. అనేకరకాలైన సుగంధభరిత పుష్పాలతో చేసే ఈ కైంకర్యం భక్తులను ఎంతగానో అలరిస్తుంది. ఆ తర్వాత స్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు పూర్తి కానున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించనున్నారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## సిబిఎస్ఇ ఫలితాల్లో..

# శ్రీసిటీ విద్యాసంస్థల విజయకేతనం

ఇటీవల వెలువడిన టెన్త్ సిబిఎస్ఇ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీ లోని చిన్మయా, అకార్డ్ విద్యాసంస్థలు విజయకేతనం ఎగరేశాయి. ఈ సంస్థల్లోని విద్యార్థులు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి అందరి అభినందనలందుకున్నారు. చిన్మయా విద్యాలయ నుంచి 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 46మంది విద్యార్థులలో 14 మంది డిస్టింక్షన్ పొందారు. వీరిలో టి.సరూప్యప్రవాహ (90.2 శాతం), ఎన్.రష్మీగౌడ్(87.4శాతం), ఆదిత్య ఝా (86.2 శాతం) మార్కులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. 12వ తరగతి పరీక్షల్లో 16మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఐదుగురు డిస్టింక్షన్ సాధించగా, మిగిలినవారు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారు. వీరిలో వంశిక కుమార్, సూర్యప్రతాప్ నాయక్, లోగిత్ ప్రియ వరుసగా 98 శాతం, 92 శాతం, 86 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. చిన్మయా విద్యాలయకు సంబంధించి వరుసగా 8వసారి పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే పన్నెండవ తరగతి పరీక్షల్లో ఇది మొదటి బ్యాచ్ కాగా, ఇందులోనూ 100 శాతం ఫలితాలతో అద్భుతమైన ప్రారంభం పాఠశాలకు దక్కిందన్నారు. 10వ తరగతి మొదటి బ్యాచ్‌తో పరీక్షలకు హాజరైన అకార్డ్ స్కూల్ 100 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటింది. కుషాగ్రా బన్సల్ 96.2 శాతం, జంపనా నేహ వర్మ 94.4శాతం, వంకా సుహృత్ 82.2శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ బృందా ప్రకటించారు. ఉత్తమశ్రేణి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు.



# జానకిరామ.. రామాయణం (13)

- ఊటుకూరు జానకి రామారావు

లక్ష గోవులతో పాటు నీవు కోరినంత ధనమిస్తానని చెపుతాడు కౌశికుడు, అందుకూ ఒప్పుకోక, రాజా నా ఆశ్రమ వ్యవస్థ మొత్తానికీ ఇది ఒక్కటే ఆధారం. దీనిని నేను ఎలా వదులుకోను! దయచేసి ఆ ఆలోచన విరమించుకో అని బదులు పలుకుతాడు వశిష్ట మహర్షి!.

వాయు భక్షణ చేస్తూ దొరికిన కందమూల ఫలాలు భక్షించే మీవద్ద ఇంత అమూల్యమైన వస్తువులెందుకు?

రాజ్యంలో శ్రేష్టమైనవన్నీ రాజు వద్దనే కదా ఉండాలి! అయినా నిన్నడిగేది ఏమిటి? నా రాజ్యంలో ఉన్నవన్నీ నావే! అని బలవంతంగా ఈడ్చుకుపోసాగాడు ఆ ఆవుని విశ్వామిత్రుడు!.

అప్పుడు శబల అతని బంధనాలనుండి తప్పించుకొని మహర్షి వద్దకు వచ్చి హే భగవన్! నీవు నన్ను ఆతనికి ఇచ్చివేశావా! అని అడుగుతుంది!... లేదు! నిన్ను నేను ఎవరికీ ఇవ్వలేదు అని చెప్పి, అమ్మా శబలా నీ రక్షణ నీవే చూసుకో అని అనుమతిస్తాడు!.

ఆ అనుమతి రావడమే తరువాయి! అప్పటివరకూ అమాయకంగా అగుపించిన శబల సబల అయ్యింది. కంట నిప్పుల వర్షం కురిసింది! ఆవిడ శరీరంలోని ప్రతి భాగం నుండి అసంఖ్యాకమైన వీరులు పుట్టుకొచ్చారు!. ఆవిడ హుంకారం నుండి పహ్లవులు, కాంభోజులు, పొదుగు నుండి శస్త్ర పాణులైన బర్బరులు, శకృత్ ప్రదేశం నుండి శకులు పృష్ఠ భాగము(వెనుక ప్రదేశం) నుండి యవనులు పుట్టలో నుండి బయటకు వచ్చే చీమలబారుల్లాగా జన్మించి క్షణాలో విశ్వామిత్రుడి సైన్యాన్ని నాశనం చేశారు!

అది చూసిన ఆయన కొడుకులు నూర్గురు సాయుధులైన వారు వశిష్ఠుడు మీదికి దండెత్తగా, మహర్షి చేసిన హుంకారానికి ఒక్కడు తప్ప అందరూ హతులవుతారు.

అప్పుడు విశ్వామిత్రుడు ఎలా ఉన్నాడంటే అలలు ఆగిపోయిన సముద్రంలాగ, కోరలు పీకిన పాములాగ, గ్రహణం పట్టిన సూర్యుడిలాగా ఉన్నాడట!

నిర్వేదంతో రాజ్యాన్ని బ్రతికి ఉన్న కొడుకుకు అప్పగించి అడవులకు వెళ్ళి శివుడిగూర్చి తీవ్రమైన తపస్సుచేసి లోకంలో ఉన్న సకల అస్త్రములు తన స్వాధీనంలోకి వచ్చేటట్లుగా వరం పొందుతాడు.

ఆ అస్త్రబలం చూసుకొని మరల వశిష్టాశ్రమం మీద దండెత్తుతాడు విశ్వామిత్రుడు!.

మహదేవుడు ప్రసాదించిన వరాలతో ఇనుమడించిన దర్పంతో, రెట్టించిన ఉత్సాహంతో మరల వశిష్ట మహర్షి ఆశ్రమం మీద దండెత్తాడు విశ్వామిత్రుడు.

వెళ్ళీ వెళ్ళడంతోటే మొత్తం తపోవనాన్ని బూడిదకుప్పగా మార్చేశాడు. దారెత్తిన మునిగణం తలోదిక్కుకు పారిపోయారు!

ఆవరించిన నిశ్శబ్దంతో, దైన్యాన్ని ప్రకటిస్తూ క్షణాలలో మరుభూమిగా మారిపోయింది వశిష్ట మహర్షి ఆశ్రమం.

ప్రాణిశూన్యమైన ఆశ్రమాన్ని చూసి వశిష్ట మహర్షి కోపంతో మూర్ఖుడా! ఎంతోకాలం నుండీ పెంచిన ఆశ్రమాన్ని, పోషించిన జీవజాలాన్ని అనాలోచితంగా నాశనం చేశావుగదరా! నీ ప్రతాపం నాపై చూపించు అని బ్రహ్మదండాన్ని ఎత్తిపట్టి మహోగ్రరూపం దాల్చి విశ్వామిత్రుడికి ఎదురుగా నిలబడ్డాడు!

విశ్వామిత్రుడు అవకాశం వచ్చింది కదా అని ఆగ్నేయ, వరుణ, రౌద్ర, ఐంద్ర, పాశుపత, ఐషికాస్త్రములన్నిటినీ ప్రయోగించినా కూడా అవి అన్నీ వశిష్ట మహర్షి బ్రహ్మదండంచేత నిలువరింపబడి నిర్వీర్యం చేయబడ్డాయి!

అప్పుడు విశ్వామిత్రుడు పట్టరాని క్రోధంతో సకలప్రపంచాలనూ భస్మీపటలం చేయగల బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినా దానిని కూడా వశిష్టుని బ్రహ్మదండం నిష్ప్రయోజనం చేసింది.

ఆ విధంగా సృష్టిలోని సకలాస్త్రములు, విశ్వామిత్రుని క్షాత్రము వశిష్టుడి బ్రహ్మతేజం ముందు వెలవెలపోయాయి.

అప్పుడు మరొకసారి భంగపాటు పొందిన విశ్వామిత్రుడి మదిలో ఆలోచన మొదలయ్యింది! అన్ని శస్త్రాలు వికలమయ్యాయి, అన్ని అస్త్రాలు విఫలమయ్యాయి! ఆహా బ్రహ్మర్షి ఎంత శక్తివంతుడు! ఇక నుండీ నా సర్వశక్తులూ వినియోగించి బ్రహ్మర్షి పథం సిద్ధింపచేసుకుంటాను.

ఆ ఆలోచన రావడమే తరువాయి అమలులో పెట్టేశాడు విశ్వామిత్రుడు. తీవ్రమైన తపస్సు వేయిసంవత్సరములు చేశాడు! అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై నీవు ఈ తపస్సువల్ల రాజర్షివైనావు అని పలికాడు! అదేమిటి నేను బ్రహ్మర్షిని కానా? అని అడిగాడు, కావు! అని సమాధానమిచ్చి అంతర్ధానమయ్యాడు బ్రహ్మ.

సిగ్గుతో చితికిపోయి మరల తీవ్రమైన తపస్సు చేయనారంభించాడు!

ఇలా తపస్సు చేస్తుండగా ఒకరోజు ఆయన వద్దకు త్రిశంకువు అనేరాజు వచ్చాడు.

త్రిశంకువు ఇక్ష్వాకు వంశపు రాజు! ఆయనకు తన శరీరంతో స్వర్గానికి వెళ్ళాలనే కోరిక కలిగింది. ఆ కోరిక తీర్చటానికి యజ్ఞం చేయమని కులగురువు వశిష్ట మహర్షిని ఆశ్రయిస్తాడు!

అందుకు ఆయన నిరాకరించి ఇది సాధ్యమయ్యే పనికాదు అని చెప్పి పంపుతాడు.

త్రిశంకువు వశిష్టుడి కుమారులవద్దకు వెళ్ళి, మీ తండ్రి నిరాకరించగా వేరే మార్గం కానరాక మీ వద్దకు వచ్చాను, నన్ను బొందితో స్వర్గానికి పంపండి అని అడుగుతాడు. అందుకు వారు కూడా నిరాకరించి కులగురువు మాట పాటించని నీకు భయంకరమైన, జుగుప్సాకరమైన రూపం కలుగుగాక అని శపిస్తారు.

ఆ రూపాన్ని చూసి బెదిరిపోయి అప్పటివరకు ఆయనను అంటిపెట్టుకున్న మంత్రి, సామంత, పురోహితులు, అందరూ దూరమవుతారు.

అప్పుడు ఆయనకు విశ్వామిత్ర రాజర్షి మదిలో మెదిలి, ఆయనను ఆశ్రయించి వశిష్టుడు తనను ఎలా నిరాదరించింది, ఆయన పుత్రులు ఏవిధంగా శపించింది తెలియచెప్పి, ఆయన చేయలేని పని నీవు చేయ



గలవు అని నీవద్దకు వచ్చాను. నన్ను సశరీరంగా స్వర్గానికి పంపగలవా! అని తన కోరిక వెలిబుచ్చాడు.

తన శత్రువు వశిష్టుడు నిరాకరించాడు కాబట్టి, తాను చేయాలి అనే భావనతో సకల మునిగణాలనూ బెదిరించి తన ఆశ్రమానికి పిలిపించి యజ్ఞానికి శ్రీకారం చుట్టాడు. ఈయన బెదిరింపులకు లొంగని వశిష్ట పుత్రులను శపించి నాశనం చేస్తాడు. అంత నష్టపరచినా వశిష్టుడు శాంతంగానే ఉంటాడు.

యజ్ఞపరిసమాప్తి రోజు త్రిశంకువును శరీరంతో స్వర్గానికి పంపితే, ఇంద్రుడు నిరాకరించి ఆతనిని స్వర్గం నుండి పడదోయగా త్రిశంకువు గింగరాలు తిరుగుతూ భూమిని సమీపిస్తూ కాపాడమని కేకలు వేస్తాడు.

తన దండం ఎత్తిపట్టి ఆయన్ని ఆకాశంలో ఉన్నచోటునే నిల్పి తీవ్రమైన కోపంతో భూమికి దక్షిణదిక్కుగా ఇంకొక స్వర్గాన్ని, ఇంకొక ఇంద్రుడిని, గ్రహ తారకలను సృష్టించబూని మొదట కొన్ని గ్రహతారకలను సృష్టిస్తాడు. ఈయన తలపెట్టిన కార్యంచూసి దేవతలు పరుగు పరుగున వచ్చి శాంతపరచి త్రిశంకువు చిరకాలం అలాగే తలక్రిందులుగా రోదసిలో ధృవంగా ఉండేటట్లు అనుగ్రహించి వెళ్ళిపోతారు.

తను తపఃశక్తి ఎంత నష్టపోయాడో గ్రహింపుకొచ్చిన ఆయన మరల తపస్సు మొదలుపెట్టి ఒక వేయిసంవత్సరాలు చేస్తాడు. అప్పుడు బ్రహ్మ, నీవు ఋషివయినావు అంటాడు, మరల ఏవో భావావేశాలకు లోనై తన తపస్సును పాడు చేసుకుంటాడు.

మరల కథ మొదటికొచ్చింది. తిరిగి తపస్సుచేస్తాడు. ఈసారి బ్రహ్మ గారు నీవు మహర్షివైనావు అంటాడు. తను చేరుకోవలసిన గమ్యం చాలా దూరముందని గ్రహించిన ఆయన మరల తపస్సుకు కూర్చుంటాడు.

ఈయన తపస్సువలన తన పదవికి ఎక్కడ మూడుతుందో అని భయపడి ఇంద్రుడు మేనకను పంపిస్తాడు. మేనక అందానికి వశుడవుతాడు విశ్వామిత్రుడు! పదివేల సంవత్సరాలు సర్వం మరచి ఆవిడే లోకంగా బ్రతుకుతాడు. తను దారి తప్పిన విషయం ఒకరోజు అన్ని సంవత్సరాల తరువాత హఠాత్తుగా గుర్తుకు వస్తుంది ఆయనకు! మేనకను పంపివేసి మరల తపస్సు మొదలుపెడతాడు విశ్వామిత్రుడు.

• ఇప్పటిదాకా అయిన విశ్వామిత్ర చరిత్ర మనకు చెపుతున్నదేమిటి?

1) మనిషికి భావావేశం కలిగినప్పటికీ వాటిని తన అదుపులో ఉంచుకోగల సమర్థత కలిగి వుండాలి. భావావేశం అదుపులో ఉంచుకోవడం అంత తేలికేం కాదు. అందుకు నిరంతర సాధన కావాలి. అదే తపస్సు!

.. (సశేషం)

# బాక్సుల్లో... భవిష్యత్!

(3వ పేజీ తరువాయి)

నుండి తెచ్చిన వేల కోట్లని దుర్వినియోగం చేశారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా దొరికిన మేరకు దోచుకున్నారు. ఇన్సైడర్ ట్రేడింగ్ ద్వారా రాజధాని చుట్టూ తమ సామాజిక వర్గాలవారి ద్వారా బాబు భూములు కొనిపించారు. ప్రజలు ఆశించిన స్థాయిలో పాలన అందించి ప్రజల మన్ననలని అందుకోవడంలో చంద్రబాబు విఫలమయ్యారు. ఆయనపైన, ఆయన సమర్థతపైన ఆంధ్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని బాబు నిలబెట్టుకోలేక పోయారన్న అపవాదుని మూటగట్టుకున్నారు.

ఇదే క్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్ర పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారు. ఒక్క అవకాశం ఇవ్వమని ప్రాధేయపడిన జగన్ విన్నపాన్ని ఆంధ్రులు మన్నించారు. కాలినడకన ఇంటింటికీ వెళ్లి అందరిని పలకరించిన జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరించారు, ఫలితంగా 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అనూహ్యంగా 151 సీట్లని సాధించి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు.

## పంపకాల పరంపరే... 2019-24 ప్రధాన అజెండా!

జగన్‌మెహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుండి తనదైన శైలిలో పరిపాలన సాగించారు. పార్టీలో, ప్రభుత్వంలో అన్నీ తానే.. అంతటా తానే అన్నట్లుగా ఒకే ఒక్కడుగా తనని తాను చాటుకున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన అనతికాలంలోనే ఆ విధంగా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ప్రమాణస్వీకారం చేసిన రోజే "ఇలాంటి ముఖ్యమంత్రిని ఈ దేశం ఇప్పటివరకు చూడలేదన్నట్లుగా మీ అందరి అభిమానాన్ని చూరగొంటాను" అని వాగ్దానం చేశారు. అన్న మాటని నిలబెట్టుకున్నారు. తాను ప్రకటించిన ప్రజా సంక్షేమ పథకాలన్నీ తొంభై శాతం పూర్తి చేశారు. నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకున్నారు. మంత్రులతో, పార్లమెంటు సభ్యులతో, శాసనసభ్యులతో, పార్టీ క్యాడర్‌తో తనకేమి పనిలేదన్నట్లుగా ప్రవర్తించారు. తన సంబంధాలన్నీ నేరుగా ప్రజలతోనే అన్నట్లుగా వ్యవహరించారు. తనని నమ్మి ఓట్లు వేసిన ప్రజల అవసరాలని తీర్చడమే తన ధ్యేయమన్నట్లుగా పంపకాల పరంపరని ప్రారంభించారు. పలు పథకాల పేరుతో ప్రజల ఖాతాలలో నేరుగా డబ్బులు జమచేయడం మొదలు పెట్టారు. తన క్యాంపు కార్యాలయాన్నే సచివాలయంగా మార్చుకుని 2,70,000 కోట్ల (అక్షరాలా రెండు లక్షలా డెబ్బైవేల కోట్లు) ప్రభుత్వ సొమ్ముని 130సార్లు బటన్ నొక్కడం ద్వారా ఓటర్లకు ఇచ్చేశారు.

గతంలో తన నాన్న రాజశేఖరరెడ్డి కొడుకుగా ఒక్క అవకాశం ఇచ్చి నన్ను ఆదరించండి అని అడిగిన జగన్... ఈసారి తన ప్రసంగాలలో రాజశేఖరరెడ్డి పేరే ప్రస్తావించలేదు. తాను కట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల వివరాలు చెప్పలేదు. తాను నిర్మించదలచిన మూడు రాజధానుల ప్రస్తావనే తేలేదు. రాష్ట్రంలో దీనావస్థలో వున్న రహదారుల ఊసే ఎత్తలేదు. దోపిడీలు, దౌర్జన్యాలతో జనానికి చుక్కలు చూపించిన తన పార్టీ నేతల గొప్పదనం గురించి చెప్పలేదు. అపరిమితంగా రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమల గురించి చెప్పలేదు. లక్షలాది మంది నిరుద్యోగులకు వచ్చిన ఉద్యోగాల గురించి చెప్పలేదు. వేలకోట్లలో పెండింగులో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల గురించి చెప్పలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్ర ఖజానా గురించి చెప్పలేదు. మైనింగ్ గ్యాంగ్‌ల గురించి గానీ, మద్యం మాఫియా గురించి గానీ, ఇసుక బకాసురులు గురించి గానీ, కాంట్రాక్టర్‌ల ఆర్తనాదాల గురించి గానీ ఆయన నోట ఒక్క మాట కూడా పలకలేదు. కేవలం తనపైనా, తన పాలనపైనా నమ్మకం ఉంటేనే ఓటేయండి అని మాత్రమే అభ్యర్థించారు.

"నేను మీకు మేలు చేశానని అనిపిస్తేనే మరో అవకాశం ఇవ్వండి" అంటూ ప్రజాక్షేత్రంలో తిరిగారు. బహుశా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్‌ని పరిపాలించిన ఏ ముఖ్యమంత్రి ఇప్పటివరకు "నా వల్ల మీకు మంచి జరిగివుంటేనే, మీ కుటుంబానికి మేలు కలిగి ఉంటేనే నన్ను మళ్ళీ గెలిపించండి" అంటూ ఓటు అడిగి ఉండకపోవచ్చు.

## ఆంధ్రా ఫలితాలు దేశరాజకీయాలకి దిక్సూచి!

ఇప్పుడు దేశ భవిష్యత్తు ఆంధ్ర బ్యాలెట్ బాక్సుల్లో ఉంది. దేశంలోని ఇతర రాష్ట్రాల రాజకీయపార్టీల భవిష్యత్ వ్యూహం ఎలా ఉండాలన్న విషయం ఆంధ్రా ఇవీఎంలలో దాగి ఉంది. భవిష్యత్ రాజకీయాల ట్రెండ్, రాజకీయపార్టీల పోకడ ఎలా ఉండాలో నిర్ణయించే తీర్పు ఆంధ్ర స్ట్రాంగ్‌రూముల్లో నిక్షిప్తమై ఉంది. ఈ దేశ భవిష్యత్‌కి దిక్సూచిగా మారనున్న ఫలితం బాక్సుల్లో భద్రంగా ఉంది.

ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, కావాలనుకుంటున్నారా...? లేక పథకాల పేరుతో తమ ఖాతాలలోకి వచ్చే పైసలు చాలనుకుంటున్నారా..? అన్న విషయం జూన్ 4న తేలనుంది!



## పెద్దాయనకు ఘన నివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, అభివృద్ధి ప్రదాత, డా. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇటీవల వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో వర్ధంతి కార్యక్రమం ఏర్పాటు చేసి పెద్దాయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సతీమణి రాజ్యలక్ష్మి, వారి తనయుడు.. వెంకటగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.







అశ్రునివాళి



నెల్లూరు కోదండరామి రెడ్డి
25 సెప్టెంబర్ 1957 - 11 మే 2024

మృదు స్వభావి...శాంతవచనుడు...ఆధ్యాత్మిక చింతనపరుడు...నిగర్వి...
జీవితంలో విజేతగా నిలిచిన మీరు...మమ్మల్ని విజేతలుగా నిలపాలని కలలు కన్నారు...
మా శ్రేయస్సు కోసమే అహర్నిశలూ పరితపించిన త్యాగశీలి మీరు...
మీ ఆలోచనల నిండా మేమే...మీ ప్రతి పనీ మా సంతోషం కోసమే...
నిత్యం మా ఉన్నతి కోసం పరితపించిన మీ ఆత్మకు శాంతి కలగాలని...
మీరు అనునిత్యం ఆరాధించిన శ్రీ సీతారాముడిని ప్రార్థిస్తున్నాం...

ఉత్తర క్రియలు: తేది: 23 మే 2024, ఉ.10.00 గంటలకు పెద్ద కర్మ, నెల్లూరు జిల్లా, బుచ్చి మండలం, కాలయకాగొల్లు గ్రామం లోని మా స్వగృహం నందు జరుగును. కావున తెలియచేయడమైనది.

ఇట్లు:
నెల్లూరు మహీధర్ రెడ్డి (కుమారుడు) — పృథ్వీతేజ (కోడలు)
నెల్లూరు శేషారెడ్డి (అన్న) — శశమ్మ (వదిన)
నెల్లూరు సాయికుమార్ రెడ్డి (తమ్ముడు) — వందన (మరదలు)
నెలబల్లి అజయ్ కుమార్ రెడ్డి (అల్లుడు) — దీప్తి (కుమార్తె)

మనుమరాళ్లు: నెల్లూరు ఆరాధ్యకృతి, నెలబల్లి అనూష



శ్రద్ధాంజలి



1933 — 2024

డాక్టర్ కందనూరు సీతారామయ్య గారు
గూడూరు

వైద్యసేవ, సమాజసేవ, సాహిత్య సేవలతో
ఎల్లప్పుడూ చెరగని చిరునవ్వుతో,
ఆప్యాయతను పంచిన మీరు, మా హృదయాలలో
సదా నిలిచి ఉండి, మాకు మార్గనిర్దేశం చేయగలరని ఆశిస్తూ...

కందనూరు రవి, భారతి
కందనూరు మధు, దుర్గ
కందనూరు శ్రీరాం, విజయ
యజ్ఞమూర్తి లలిత, శశికుమార్
మనవళ్ళు, మనవరాళ్ళు, కుటుంబసభ్యులు

To send WhatsApp messages : 9884015569



# నర్సుల సేవలు అమూల్యం

వైద్యరంగంలో నర్సులు రోగుల బాగుకోసం చేస్తున్న సేవలు అమూల్యం, అభినందనీయమని పలువరు వక్తలు కొనియాడారు. ఈనెల 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కోవూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆదర్శ సేవామూర్తి ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నర్సులు, వైద్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విజేత మాట్లాడుతూ నర్సుల సేవలు సమాజానికి మార్గదర్శకమన్నారు. అనంతరం పలువురు నర్సుల సేవలను అభినందిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. ప్రముఖ వైద్యులు వెంకటాచలపతి, ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మారుతి నాగార్జున, హితేష్‌కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణస్వామికి..
# లక్ష మల్లెల పూజ



అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని, నెల్లూరు సంతపేటలోని వ్యాసరాజ మఠంలో కొలువైవున్న శ్రీ సత్యనారాయణస్వామికి ఆలయ అర్చకులు ఇటీవల కన్నులపండువగా లక్ష మల్లెల పూజ నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాతసేవ తదితర విశేష పూజలు చేసిన అనంతరం శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కె.నరసింహ శ్రీధర ఆచార్యులు నిర్వహించగా, రాఘవేంద్ర మఠం ప్రతినిధులు రంగబాబు, సింహపురి మధ్వ సంఘం వారు పర్యవేక్షించారు. లక్ష్మీవెంకట సంజీవరావు-రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మఠం మేనేజర్ రవీంద్రబాబు, కార్యనిర్వాహకుడు అరవవల్లి సుబ్బారావు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# ఆదిశంకరులు..అపర శంకరులు!

### అవధాని కోట రాజశేఖర్



ధర్మోద్ధరణే ధ్యేయంగా అవతరించిన మహనీయులు శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల వారని, ఆదిశంకరులంటే అపర శంకరులేనని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ కీర్తించారు. వైశాఖ శుద్ధ పంచమి ఆదివారం (ఈనెల 12) శ్రీ శంకరాచార్యులవారి జయంతి సందర్భంగా నెల్లూరులోని ఆదిశంకర ధ్యాన మందిరంలో జరిగిన ఆధ్యాత్మికోపన్యాసంలో ఆయన మాట్లాడారు. హైందవ ధర్మప్రచారం కోసం సుమారు 12వందల సంవత్సరాల క్రితమే దేశమంతటా మూడుసార్లు పర్యటించి, దేశంలోని నాలుగు దిక్కుల్లో నాలుగు ధర్మపీఠాలను ఏర్పాటు చేసిన అవతారమూర్తి శ్రీ శంకరాచార్యులవారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా శంకరాచార్యులవారు ఆ కాలంలోనే ఆశువుగా చెప్పిన 'కనకధారా స్తవము'ను, వారు రచించిన 'సౌందర్యలహరి' ఆధ్యాత్మిక గ్రంథంలోని కొన్ని శ్లోకాలను ఆయన శ్రవణపేయంగా వినిపించారు. శ్రీ చక్రాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకట లక్ష్మీనరసింహం (స్వామి సమయానందనాథ), మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్‌తో పాటు అన్నవరం సత్యనారాయణ, మల్లవరపు లక్ష్మీనరసింహారావు, ములుమూడి ఉదయకుమార్ శర్మ, కొండపి శ్రీనివాసరావు, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, నేత్రవైద్యులు కృష్ణమూర్తి, పాలేటి ఛాయాకుమారి, చక్రాల నాగరత్నకుమారి తదితరులు పాల్గొని, ఉపన్యాసం అనంతరం అవధాని రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు.

# ప్రతిభతో రాణిస్తున్న విద్యార్థులు

సీబీఎస్ఇ (సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)లో జిల్లా విద్యార్థులు ప్రతిభతో రాణిస్తుండడం అభినందనీయం. జిల్లాలో సీబీఎస్ఇ స్కూళ్లు పలుచోట్ల ఉన్నాయి. టెన్త్, ఇంటర్‌లలో ప్రత్యేకంగా సీబీఎస్ఇ విధానం ద్వారా బోధన జరుగుతుంటుంది. జిల్లా వ్యాప్తంగా రెయిన్‌బో, ఇథాకా, అమెన్యూస్, అక్షర, రత్నం, గోమతి, నారాయణ, అంబర్‌వుడ్ విద్యాసంస్థలతో పాటు కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయం, ఇందుకూరుపేటలోని చిన్మయ మిషన్ విద్యాలయం, కావలిలోని ఆర్ఎస్ఆర్ స్కూల్‌తో పాటు మరో 6 విద్యాసంస్థలో సీబీఎస్ఇ విద్యాబోధన జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన వార్షిక పరీక్షలకు సంబంధించి తాజాగా విడుదలైన ఫలితాల్లో జిల్లాలోని అనేక విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమశ్రేణి ర్యాంకులు సాధించడంతో ఆ విద్యార్థులతో పాటు తల్లితండ్రులు, విద్యాసంస్థల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరులోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థిని ప్రాప్తిజైన్ ఈ పరీక్షల్లో 500 మార్కులకు 495 మార్కులు సాధించి జిల్లాలోనే అగ్రగామిగా నిలిచి అందరి అభినందనలు అందుకున్నారు. అంతేకాకె, అదేస్కూల్‌కు చెందిన దియా మెహతా 484మార్కులతో రెండవ స్థానంలోను, నారాయణ-గోమతి సీబీఎస్ఇ పాఠశాలకు చెందిన భావిక చిన్ని 483 మార్కులు, శ్రీహాన్ 482 మార్కులు, నిత్యానంద్ 480 మార్కులు సాధించారు. జిల్లాలోని సీబీఎస్ఇ స్కూల్స్‌కు చెందిన 1246 మంది 10వ తరగతి పరీక్షలకు, మరో 461 మంది ఇంటర్ పరీక్షలకు హాజరు కాగా, 98శాతం మంది టెన్త్ విద్యార్థులు, 96 శాతం మంది ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం విశేషం.

# 'మెడికవర్'లో అరుదైన శస్త్ర చికిత్స

### విజయవంతంగా చేసిన వైద్యులు




నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో వైద్యులు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యతో వచ్చిన ఓ యువతికి విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఆ యువతి లంగ్ ఆడప్పస్, హైడ్రోఇక్‌సిస్ట్ సమస్యతో బాధపడుతుండేదని, తమ ఆసుపత్రిలోని అధునాతన వైద్యపరికరాలతో దానిని గుర్తించి, ఎంతో అరుదైన శస్త్రచికిత్స ద్వారా ఆమె పూర్తిగా కోలుకునే విధంగా చేశామని ఆసుపత్రి వైద్యులు కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 14న ఆయన ఆసుపత్రిలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి ఈ విషయం చెప్పారు. చెన్నైకి వెళ్లి ఆమె సర్జరీ చేయించుకోవాలని అనుకున్నారని, అయితే మెడికవర్ ఆసుపత్రికి నమ్మకంతో వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్న ఆమెకు, వారి అంగీకారంతో ఇక్కడే శస్త్రచికిత్సను చేసి, ఆమె కోలుకునేలా చేశామన్నారు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న తమ బిడ్డకు సకాలంలో ఇక్కడి వైద్యులు వైద్యపరీక్షలు చేసి చికిత్సలు అందించడం వల్ల ఆమె కోలుకుందని ఈ సందర్భంగా ఆమె తల్లి విజయలక్ష్మి విలేకర్లకు తెలిపి, సంబంధిత వైద్యులందరికీ ఆమె తన కృతజ్ఞతలు చెప్పారు.

# పట్టాలు దాటుతుండగా ప్రమాదం

- ఎన్నికల విధులకు వెళ్తూ.. రైలు ఢీకొని మహిళ కన్నుమూత
- తల్లిని కాపాడబోయి.. కుమారుడు కూడా మృత్యువాత



విధి ఎంతో బలీయమైనదని.. కర్కశమైనదని అంటుంటారు. కొన్ని సంఘటనలు చూస్తే అదెంతో నిజమనిపిస్తుంటుంది. మొన్నటికి మొన్న ఎన్నికల విధులకు వెళ్తున్న ఓ మహిళకు జరిగిన ప్రమాదం ఎంత ఘోరమో చెప్పలేం. పట్టాలు దాటుతుండగా రైలు రూపంలో మృత్యువు ఆ తల్లిని పొట్టనబెట్టుకుంది. పక్కనే ఉన్న కుమారుడు అమ్మను రక్షించబోయి తాను కూడా మరణించాడు. ఈ దుర్ఘటన ఈనెల 12న కావలి వద్ద జరిగింది.

పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బి.సుభాషిణి (56) తన కుమారుని తోడుగా తీసుకుని, కావలిలో ఎన్నికల విధులకు బయలుదేరింది. కావలిలో రైలు దిగి రైల్వే ట్రాక్ దాటుతుండగా, పక్క ట్రాక్‌లో వేగంగా వస్తున్న రైలును గమనించకుండా ఆమె ఆ ట్రాక్‌లోకి వెళ్ళడంతో, అది చూసిన కుమారుడు వెంటనే ఆమెను కాపాడబోయాడు. కానీ అప్పటికే ఘోరం జరిగిపోయింది. ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో తల్లీకొడుకులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుభాషిణి భర్త మూడు నెలల క్రితమే రోడ్డు ప్రమాదంలో మరణించడం, ఇప్పుడు తల్లీబిడ్డలు రైలు ప్రమాదంలో మృతిచెందడం విషాదకరం. దీంతో చాగణంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## టూకీగా...



### కొమ్మలపూడిలో ఉద్రిక్తత.. పోలీస్ పికెట్ ఏర్పాటు

ఎన్నికల నేపథ్యంలో మనుబోలు మండలంలోని కొమ్మలపూడిలో వైకాపా-తెదేపా నాయకుల మధ్య ఘర్షణలు, ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసులు మంగళవారం నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఇరు పార్టీల వారిని శాంతింపజేసి, గ్రామంలో ప్రశాంత వాతావరణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### మూలస్థానేశ్వరునికి వసంతోత్సవాలు

నెల్లూరు మూలాపేటలో వెలసివున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈనెల 20వ తేది వరకు జరిగే ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఇఓ వేణు గోపాల్ ఒక ప్రకటనలో కోరారు.

### తిరుమలమ్మపాళెం మాజీ సర్పంచ్ కన్నుమూత

వెంకటాచలం మండలం తిరుమలమ్మపాళెం మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీవీ శేషారెడ్డికి గతంలో అనుచరునిగా ఉన్న రౌతు మల్లికార్జున్ (55) ఇటీవల మృతి చెందారు. ఆయన మరణవార్త తెలియగానే సీవీ ఆయన నివాసానికి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలిపారు.

### మనుబోలు వద్ద రోడ్డుప్రమాదం.. ఇద్దరు దుర్మరణం

మనుబోలు బైపాస్‌రోడ్డు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్ళకూరు మండలం వడ్డిపాళెంకు చెందిన చల్లా ఆకాష్(19), బండి వేణు(18) నెల్లూరుకు బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యంలో బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో వేణు అక్కడికక్కడే చనిపోయాడు. ఆకాష్ తలకు దెబ్బతగలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

### బిట్రగుంట వద్ద రైలు ఢీకొని.. రెండు దుప్పులు మృతి

బోగోలు మండలం బిట్రగుంట వద్ద ఇటీవల రైలు ఢీకొనడంతో రెండు దుప్పులు మరణించాయి. దాహం తీర్చుకునేందుకు రైల్వే ట్రాక్‌పై రావడంతో దుప్పులకు ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. రైల్వే పోలీసుల సమాచారంతో అటవీశాఖ అధికారి సుమన్, పశువైద్యాధికారిణి వచ్చి పోస్టుమార్టం నిర్వహించి వాటిని ఖననం చేశారు.

### మర్రిపాడులో కాలువలో పడిపోయిన కారు

మండల కేంద్రమైన మర్రిపాడులోని జూనియర్ కళాశాల వద్ద ఒక కారు ఇటీవల వేగంగా వస్తూ అదుపు తప్పి అక్కడున్న కాలువలో పడిపోయింది. కారులో ఉన్న వ్యక్తికి గాయాలు తగిలాయి. స్థానికులు చూసి ఆసుపత్రికి తరలించారు.

### మైపాడు బీచ్‌లో మహిళను కాపాడిన మెరైన్ పోలీసులు

ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌కి ఇటీవల కుటుంబసభ్యులతో కలసి సముద్రస్నానానికి వెళ్లిన నెల్లూరుకు చెందిన భాగ్యమ్మ అనే మహిళకు ఉన్నట్లుండి ఫిట్స్ రావడంతో, అక్కడున్న మెరైన్ పోలీసులు వర్ధన్, అల్లాభక్షు గమనించి వెంటనే ఆమెకు ప్రాథమిక చికిత్స చేసి కాపాడారు. కాస్త కోలుకున్నాక అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు.

### సంగమేశ్వరునికి విశేష పూజలు

మనుబోలు వద్ద కండలేరు నదీతీరంలో బద్దెవోలు సమీపంలోని శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 14న విశేష పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాలు జరిగి నెలరోజులైన సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు, కామాక్షిదేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. కమలాకర్‌రెడ్డి-రాధమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### చెముడుగుంట వద్ద కారు ఢీ.. రెండు గేదెలు మృత్యువాత

నెల్లూరు నగర శివార్లలోని చెముడుగుంట వద్ద ఇటీవల అర్ధరాత్రి వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో, వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొని రోడ్డుపై వస్తున్న రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. కారు ముందు భాగం కూడా నుజ్జునుజ్జయిపోయింది. అతివేగంగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగివుంటుందని అనుకుంటున్నారు.

# ఈసారి కూడా వైకాపా ప్రభంజనమే!

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా



రాష్ట్రంలో ఈసారి కూడా వైకాపా ప్రభంజనం సృష్టిస్తుందని, వైకాపా గెలుపు తథ్యమని వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులు జగనన్నకు మెండుగా ఉన్నాయని, ఈ ఎన్నికల్లో వైకాపా విజయభేరీ మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం జగన్ సూచనతో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ దాఖలు చేశానని, అప్పటినుండి పోలింగ్ జరిగే వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తమకు వెన్నుదన్నుగా ఉంటూ పార్టీ గెలుపు కోసం అహరహం శ్రమించారన్నారు. అనేకమంది వాలంటీర్లు సైతం రాజీనామా చేసి తన గెలుపు కోసం పాటుపడ్డారని, రాష్ట్రంలో జగనన్న సీఎం అయిన తర్వాత వాలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. టిడిపి నేతలు ఓడిపోతామన్న భయంతోనే అల్లర్లకు, హింసాత్మకమైన ఘటనలకు పాల్పడుతున్నారని, అది సబబు కాదన్నారు. ఎన్నికల కమిషన్ అధికారులు, పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ హింసకు తావు లేకుండా నివారణ చర్యలు తీసుకున్నారన్నారు. వెంకటగిరిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం ఆకతాయిల పనేనని అంటూ, ఆ దుశ్చర్యను తాను ఖండిస్తున్నానని, నిందితులని వెంటనే అరెస్టు చేసేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వెంకటగిరిలో డా. అంబేద్కర్ భవనం నిర్మాణానికి తనవంతు చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. తమ తండ్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అక్టోబర్ 1991వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్సిటీగా ఉన్న ఆ విశ్వవిద్యాలయానికి 'డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ' గా నామకరణం చేశారని ఆయన గుర్తుచేశారు. తమ తండ్రికి రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ రచనలన్నా, సిద్ధాంతాలన్నా చాలా ఇష్టమని చెప్పారు. వారిని ఆదర్శంగా తీసుకొనే రాజకీయంగా ముందుకి ఎలా వెళ్లాలో, అట్టడుగు ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో ఆలోచించేవారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



చిన్నతనం నుంచే ప్రతిఒక్కరూ మహనీయులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతాదర్శాలతో సమున్నతంగా రాణించాలని రాపూరు మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. అంకయ్య చిన్నారులకు ప్రబోధించారు. ఈనెల 15న రాపూరులోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచి నైతిక ప్రవర్తనను అలవరచుకోవాలన్నారు. మహనీయుల జీవితచరిత్రలను ఆకళింపు చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారిణి జె.ధనమ్మ, కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే.. వైసీపీ నేతల విధ్వంసం

## - మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం



రాష్ట్రంలో వైకాపావాళ్ళు అనేకచోట్ల దాడులకు పాల్పడుతూ, అరాచకం సృష్టిస్తున్నారని, ఎన్నికల్లో ఓటమి భయంతోనే వారు విధ్వంసం సృష్టిస్తున్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకుడు, సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 16న ఆయన మంగళగిరిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, మే 13న జరిగిన ఎన్నికలు అహంకారానికి–ఆత్మగౌరవానికి మధ్య జరిగినవేనన్నారు. అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌ను అరాచకాంధ్రప్రదేశ్‌గా మార్చారని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న జగన్ ఐఏఎస్, ఐసీపీఎస్‌లను కూడా లెక్కచేయకుండా ప్రవర్తించారని అన్నారు. శాసనసభలో తీసుకున్న నిర్ణయాలను చెత్తబుట్టలో పడేశాడని, అసలు చట్టసభ నిర్ణయాలకు విలువే లేకుండా చేశారని, వ్యవస్థలకు విలువనివ్వలేదని, ఒక్కమాటలో చెప్పాలంటే జగన్‌రెడ్డి పాలన ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని దుయ్యబట్టారు. దేశంలో ఏపీ అంటే తలదించుకునేలా చేశాడన్నారు. అయిదేళ్ల అరాచకాన్ని పారదోలేందుకు ప్రజలు కట్టలు తెంచుకుని వచ్చి ఓట్లు వేశారన్నారు. దాన్ని కూడా తట్టుకోలేక వైసీపీ నేతలు ఇష్టంవచ్చినట్లు దాడులకు తెగబడుతున్నారు. దుర్మార్గంగా దాడులు చేస్తూ, మరోవైపు వైకాపా గెలిచేస్తుందంటూ ప్రచారాలు చేసుకుంటున్నారని, ఇంతటి దుస్థితి ఏ రాష్ట్రానికీ లేదని అన్నారు.

రాష్ట్ర భవిష్యత్ ఎవరి చేతిలో ఉంటే బాగుంటుందో ఓటర్లకు తెలుసునని, అందుకే వ్యయాన్ని లెక్కచేయకుండా దూర ప్రాంతాల నుండి కూడా వచ్చి ఓట్లు వేశారని అన్నారు. దానిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు దగ్గరుండి దాడులు చేయిస్తున్నారంటూ మండిపడ్డారు. బయట నుండి గూండాలను తీసుకువచ్చి సర్వేపల్లిలో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తుంటే పోలీసులు మీనమేషాలు లెక్కపెడుతున్నారని విమర్శించారు. అన్ని నియోజవర్గాల్లోనూ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారని అన్నారు. అయితే, జగన్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకున్నారని, ఈ ఎన్నికల్లో భారీ విజయంతో ఎన్డీఏ కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 24 నుంచి..టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేది వరకు జరుగుతాయని డీఇఓ రామారావు ఈనెల 15న ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని ఉపయోగించి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని పేర్కొన్నారు.


సంస్మరణ



కీ॥శే॥ కోర్శపాటి గోపాలరెడ్డి గారు - కీ॥శే॥ కోర్శపాటి సీతమ్మ గారు
నిర్యాణం : 06.05.2012 నిర్యాణం : 20.05.2020

మా ఇంటి దీపాలు, మా కంటి వెలుగులు
ఆదర్శ దంపతులు
కీ॥శే॥ కోర్శపాటి గోపాలరెడ్డి
కీ॥శే॥ కోర్శపాటి సీతమ్మ గారలను
సంస్మరించుకుంటూ...

కుమారుడు - కోడలు:
కోర్శపాటి శ్రీధర్‌రెడ్డి, USA - కోర్శపాటి శైలజ
కుమార్తెలు - అల్లుళ్ళు
మోసూరు హైమావతి - మోసూరు షణ్ముగంరెడ్డి
ఇసనాక శ్యామల - ఇసనాక జనార్ధన్‌రెడ్డి, USA
చేవూరు జ్ఞానప్రసూన - చేవూరు కృష్ణారెడ్డి
మరియు మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమడు





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com